
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 5 సెప్టెంబరు 2025





మహిళా సంఘానికి రాజేంద్రనగర్‌లో ఉన్న రూ.10 కోట్ల విలువ చేసే మూడు అంతస్తుల పాఠశాల భవనాన్ని లీజు పేరుతో చేజిక్కించుకునేందుకు గుడివాడకు చెందిన ప్రముఖ విద్యాసంస్థ యజమాని ఒకరు కుట్ర పన్నారు. ఇటీవల జరిగిన సంఘ సమావేశంలోకి బయట వ్యక్తులను పంపి రగడ సృష్టించారు. సంఘ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసి భవనాన్ని కబ్జా చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. దీన్ని ఎలాగైనా అడ్డుకుంటామని మహిళా సంఘం సభ్యులు స్పష్టం చేస్తున్నారు.


మాంటిస్సోరి తెలుగు మీడియం పాఠశాల భవనం

రూ.10 కోట్ల విలువైన భవనంపై కన్ను!

లీజు పేరుతో చేజిక్కించుకొనేందుకు కుట్ర

- ఇటీవల మహిళా సంఘంలో రగడ సృష్టించేందుకు యత్నం
- గుడివాడలో ఓ ప్రముఖ ప్రైవేటు విద్యా సంస్థ నిర్వాహకుడి నిర్వాకం
- కుట్రలను అడ్డుకుని భవనం కాపాడుకుంటామంటున్న సంఘ సభ్యులు

ఆంధ్రజ్యోతి - గుడివాడ: గుడివాడ పట్టణానికి చెందిన మహిళా సంఘం 1972కు పూర్వం ఏర్పడింది. దీనికి స్థానిక రాజేంద్రనగర్‌లో ఎదురెదురుగా కోట్లాది రూపాయలు విలువ చేసే మాంటిస్సోరి తెలుగు మీడియం, ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల భవనాలున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో తెలుగు మీడియం తీసివేయడంతో మూడు అంతస్తుల భవనం ఖాళీ అయ్యింది. ప్రస్తుతం ఉన్న ఇంగ్లీషు మీడియంలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడంతో తరగతి గదుల కొరత ఏర్పడింది. దీంతో ఖాళీగా ఉన్న తెలుగు మీడియం భవనంలో కొన్ని తరగతులను నిర్వహించుకుంటున్నారు. కొన్నేళ్లుగా సదరు భవనంపై పట్టణానికి చెందిన ఓ ప్రముఖ ప్రైవేటు విద్యాసంస్థ నిర్వాహకుడి కన్ను ఉంది. ఇదే రాజేంద్రనగర్‌లో ప్రస్తుతం స్థలం కొనుగోలు చేసి కొత్త భవనం కట్టాలంటే కోట్లాది రూపాయలు ఖర్చు అవుతుంది కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో ఆ భవనాన్ని నామమాత్రపు లీజు పేరుతో చేజిక్కించుకుంటే వెనుదిరిగి చూడాల్సిన పని ఉండదని మాస్టర్ ప్లాన్ రచించారు. పూర్వ కరస్పాండెంట్ ద్వారా భవనాన్ని కబ్జా చేయాలని యత్నించారు.

సమావేశంలో గొడవ సృష్టించారు..

మహిళా సంఘంలో 279 మంది సభ్యులున్నారు. సంఘంలో కార్యకలాపాల నిర్వహణకు కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. ఈ క్రమంలో ఇటీవల అవినీతి ఆరోపణల నేపథ్యంతో సంఘం బోర్డు సభ్యులందరూ ఏకగ్రీవ తీర్మానంతో కరస్పాండెంట్‌ను తొలగించారు. ఇటీవల సంఘ సమావేశాన్ని స్థానిక గౌరీ శంకరపురంలోని మాంటిస్సోరి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. భవనంపై కన్నేసిన సదరు ప్రముఖ ప్రైవేటు విద్యాసంస్థ నిర్వాహకుడు సంఘంతో సంబంధం లేని కొందరు మహిళలను పంపి సమావేశం నిలుపుదల చేసేలా కుట్రలు పన్నారు. సంఘం సభ్యులు కానీ కొందరు మహిళలు పాఠశాల గేట్లు తోసుకుంటూ సమావేశంలో చొరబడ్డారు. ఒక్కసారిగా మహిళా సంఘం సభ్యులపై దాడికి దిగారు. కుర్చీలు గాలిలోకి విసిరేస్తూ, షామియానాలను లాగేస్తూ నానా రభసా చేశారు. తీర్మానాలను రాసుకునే మినిట్స్ పుస్తకాన్ని చింపి విసిరేశారు. అడ్డు వచ్చిన డ్రైవర్‌పై దాడి చేశారని బోర్డు సభ్యులు ఆరోపించారు. సంఘం సభ్యులు కూడా ధీటుగా స్పందించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే పోలీసులు ఫిర్యాదు తీసుకునేందుకు నిరాకరించారు. కాగా, పూర్వ కరస్పాండెంట్‌ను అడ్డుపెట్టుకుని సదరు ప్రైవేటు విద్యా సంస్థ నిర్వాహకుడు చక్రం తిప్పుదామనుకుంటే ఆమెనే తొలగించి మహిళా సంఘం సభ్యులు షాక్ ఇచ్చారు.

సంఘం ఆస్తులను పరిరక్షిస్తాం

- మహిళా సంఘం సభ్యులు

మూడు అంతస్తుల తెలుగు మీడియం భవనం ఖాళీగా ఉందని మహిళా సంఘం కరస్పాండెంట్ కం కార్యదర్శి వల్లూరుపల్లి శారద, అధ్యక్షురాలు వల్లూరుపల్లి లక్ష్మి తెలిపారు. మూడో అంతస్తును మరమ్మతుల నిమిత్తం వాడటం లేదన్నారు. ఇంగ్లీషు మీడియంలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో కొన్ని తరగతులను పాత భవనంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘానికి గుడివాడలో కోట్లాది రూపాయల ఆస్తులున్నాయన్నారు. వాటి పరిరక్షణ బాధ్యత మహిళా సంఘంపై ఉందని పేర్కొన్నారు.

ఇసుక తవ్వొద్దు

- ముడా భూముల్లోకి వెళ్లొద్దు
- ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దు
- అక్రమాలకు పాల్పడుతున్న వారికి మంత్రి కొల్లు రవీంద్ర క్లాస్
- కరగ్రహారం, క్యాంప్‌బెల్‌పేట గ్రామస్థులతో ఇటీవల సమావేశం
- పలు అంశాలపై దిశానిర్దేశం.. హెచ్చరికలు జారీ




మచిలీపట్నం నార్త్ మండలంలో బుసక తవ్వకాలపై మంత్రి కొల్లు రవీంద్ర సీరియస్ అయ్యారు. మచిలీపట్నం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)కి చెందిన భూముల్లో బుసక తవ్వొద్దని టీడీపీ నాయకులను ఆదేశించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి బుసక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనింగ్ అధికారుల నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే సొంత భూముల నుంచి బుసక తవ్వకాలు చేసుకోవాలని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: నియోజకవర్గంలో పలు గ్రామాలకు, సముద్రానికి మధ్యన ఉన్న బే ఆఫ్ బెంగాల్, ముడా భూముల్లో కొందరు ఇష్టారాజ్యంగా బుసక తవ్వకాలు చేస్తున్నారు. దీంతో సముద్ర జలాలు గ్రామాల్లోకి చొచ్చుకువచ్చే ప్రమాదం పొంచి ఉంది. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బుసక తవ్వకాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయం మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం కరగ్రహారం, క్యాంప్‌బెల్‌పేట తదితర గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులతో మంత్రి సమావేశం నిర్వహించారు. పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామాలకు, సముద్రానికి మధ్యన ఉన్న బే ఆఫ్ బెంగాల్, ముడా భూముల్లో వైసీపీ ప్రభుత్వంలో, ఇటీవల కాలంలోనూ బుసక తవ్వకాలు చేస్తున్నారని తెలిపారు. తుఫాన్లు సంభవించిన సమయంలో సముద్రపు అలలు పెద్ద ఎత్తున వస్తే గ్రామాల్లోకి నీరు రావడం ఖాయమన్నారు. కొందరు అక్రమార్కులు యంత్రాల ద్వారా సముద్రం ఒడ్డున సహజ సిద్ధంగా తయారైన బుసక మేటలను సైతం తవ్వేస్తున్నారని ఆరోపించారు. దీంతో సముద్ర తీర గ్రామాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. 1977, నవంబరు నెలలో సంభవించిన తుఫాన్ సమయంలో మిగతా 4లో..

ఎకరం భూమి స్వాహా

- పాతపాడులో ఓ వీఎంసీ ఉద్యోగి నిర్వాకం
- నిర్ధారించిన పోలవరం డీఈఈ
- స్థలం స్వాధీనం చేసుకోవాలని ఎమ్మార్వోకు లేఖ


పాతపాడులోని ఆక్రమిత స్థలం

గుణదల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామంలో పోలవరం కాల్వకు, జగనన్న కాలనీకి మధ్య ఉన్న ఎకరం భూమిని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ)లో పనిచేసే ఓ ఉద్యోగి ఆక్రమించుకున్నాడు. ఆక్రమిత భూమి చుట్టూ సరిహద్దులతో కూడిన సిమెంట్ పోల్స్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాడు. అంతేకాదు.. ఇందులోని సుమారు 20 సెంట్లను రూ.20 లక్షలకు అమ్ముకున్నాడు కూడా. మిగిలిన 80 సెంట్ల జాగాలో మామిడి, కంది మొక్కలు వేసి మధ్యలో చర్చి నిర్మించడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ విషయం పోలవరం డీఈఈ శ్రీనివాసరావుకి తెలియడంతో ఆయన సర్వే చేయించారు. ఆక్రమణ నిజమని తెలుసుకుని విజయవాడ రూరల్ ఎమ్మార్వోకు లేఖ రాశారు. జీవో నెంబరు 188 ద్వారా రెవెన్యూ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని కొందరు స్థానికులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా, ఉన్నతాధికారులు ఆదేశిస్తే.. ఆక్రమణలు తొలగిస్తానన్నారు. ఆక్రమణదారుడు మరోచోట ఉన్న ఖాళీ స్థలంలోనూ కొంతమందితో పాకలు వేయించాడు. శివాలయం కట్టుకోవచ్చని సలహా ఇచ్చి ఒకచోట శివలింగం, దానిముందే నంది విగ్రహాలు ఏర్పాటు చేయించాడు. ఆక్రమిత స్థలాన్ని పరిశీలించేందుకు పోలవరం డీఈఈ వెళ్లగా, అధికారులను సైతం బెదిరించే ధోరణితో మాట్లాడాడు. ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీ హయాంలో నిధుల దుర్వినియోగం

6లో

- రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

యూరియాపై కదలిక

- రైతుల సమస్యపై స్పందించిన కలెక్టర్
- గుడివాడ డివిజన్‌లో క్షేత్రస్థాయి పర్యటన
- రైతులు, సొసైటీ అధ్యక్షులతో మాట్లాడి వివరాల సేకరణ
- ఎరువుల సరఫరా కేంద్రాల తనిఖీ
- 3 వేల టన్నుల యూరియా దిగుమతి
- అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు
- స్పష్టం చేసిన కలెక్టర్ బాలాజీ


గుడివాడ డివిజన్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో వ్యవసాయ,రెవెన్యూ అధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/గుడివాడ రూరల్ : జిల్లాలో యూరియా కొరతను అధికారులు అధిగమిస్తారా లేక నామమాత్రపు తనిఖీలతో సరిపెడతారా అనే ప్రశ్నలు సర్వత్రా ఉదయిస్తున్నాయి. వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో గతేడాది ఆగస్టులో ఎంత యూరియా వినియోగించారో, ఈ ఏడాది అంతే మొత్తంలో జిల్లాకు తీసుకువచ్చామని పేర్కొన్నారు. అయితే ఈ యూరియా ఎంతమేర రైతులకు విక్రయించారనే అంశంపై మాత్రం పూర్తిస్థాయి లెక్కలు చెప్పడం లేదు. యూరియా విక్రయాలపై అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా కలెక్టర్ నేరుగా రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వేధిస్తున్న యూరియా సమస్య

ఆగస్టు నెలలో కురిసిన వర్షాల కారణంగా నెలరోజులలోపు నాట్లు పూర్తి చేసిన పొలాలు, పిలక తొడిగే దశలో ఉన్న వరిపైరు నీటమునిగింది. పొలంలో నీరు తగ్గిన తర్వాత పైరు త్వరితగతిన కోలుకుని బలం పుంజుకునేందుకు ఎకరానికి 25 కిలోల యూరియాను జల్లాలని వ్యవసాయశాఖ అధికారులు ఇటీవల కాలంలో రైతులకు సూచన చేశారు. దీంతో పాటు ముందస్తుగా వరినాట్లు పూర్తి చేసిన పొలాల్లో రెండు, మూడు కోటాలుగా ఎరువులను రైతులు జల్లుతున్నారు. కాంప్లెక్స్ ఎరువులతో పాటు ఎకరానికి 25కిలోల యూరియా కలిపి జల్లుతారు. కీలక సమయంలోనే యూరియా కొరతను కొందరు సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో యూరియా విక్రయాలకు తెరతీశారు. నిబంధనలకు విరుద్ధంగా యూరియా అక్రమ నిల్వలు ఎక్కడ ఉన్నాయో వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు తెలిసినా వారు మిన్నకుండిపోయారు. దీంతో రైతులకు యూరియా అందుబాటులో లేక యూరియా కోసం పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చింది. మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలో యూరియా లారీని వైసీపీ నాయకులు అడ్డుకోవడం, ఈ అంశం వివాదాస్పదం కావడంతో నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ అంశంపై స్పందించారు. దీంతో జిల్లా అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలనకు బయలు దేరారు.

కొరత రానివ్వం : కలెక్టర్ బాలాజీ

జిల్లాలో యూరియా కొరతపై కలెక్టర్ బాలాజీ స్పందించారు. గుడివాడ మండలంలోని లింగవరం, వలివర్తిపాడు, రామన్నపూడి పీఏసీఎస్‌లతోపాటు గుడివాడలోని గ్రోమోర్‌ఎరువుల దుకాణాలను ఆయన గురువారం పరిశీలించారు. యూరియా కొరత, విక్రయాలపై రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత మచిలీపట్నం కలెక్టరేట్‌లో, గుడివాడలోని మిగతా 4లో..

అమ్మ సొమ్మంటే అలుసా!

- దసరా ఉత్సవాల్లో ప్రభుత్వ శాఖల ఇండెంట్ రూ.4 కోట్లు
- కార్పొరేషన్, పోలీసు, మత్స్యశాఖ, ఇరిగేషన్, విద్యుత్ శాఖలవే..
- రాష్ట్ర పండుగగా నిర్వహించే ఉత్సవాలకు దేవస్థానం డబ్బెందుకు?
- 4,500 మంది పోలీసులే ఎక్కువ.. వారికి రూ.కోటి ఖర్చా..?
- తిరుమల బ్రహ్మోత్సవాల్లోనూ ఈ పద్ధతి లేదు
- ఏటా దుర్గమ్మ ఆదాయానికి భారీగా కోత



అమ్మ సొమ్మంటే అందరికీ అలుసే. ఉన్న దానికి, లేనిదానికి ఇబ్బడిముబ్బడిగా, ఇష్టానుసారంగా ఇండెంట్లు పెట్టడం చూస్తే ఇది నిజమేననిపిస్తుంది. ఇంద్రకీలాద్రిపై 10 రోజుల పాటు జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు రాష్ట్రస్థాయి పండుగ. దీనికి ప్రభుత్వంలోని ఏ శాఖ అయినా ఉచితంగా విధులు నిర్వహించాలి. దుర్గమ్మకు చేసుకునే సేవాభాగ్యంగా భావించాలి. అలాకాకుండా.. తాము విధులు నిర్వహిస్తున్నందుకు రూ.కోట్లలో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి ఇండెంట్లు పెట్టడం ఏమిటో విడ్డూరంగా ఉంది. ఈ ఏడాది ఉత్సవాలకు ఏకంగా రూ.4 కోట్ల దేవస్థాన నిధులు ఖర్చు చేయించేందుకు ఇండెంట్లు రావడం విమర్శలకు తావిస్తోంది.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.అరకోటి

ఇంద్రకీలాద్రి దిగువ ప్రాంతాలు, రోడ్లు, స్నానఘాట్లు, పార్కింగ్ ఏరియాలు, టికెట్, ప్రసాద కౌంటర్ల దగ్గర పారిశుధ్య పనులను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తుంది. ఈ పనులు చేయటం కార్పొరేషన్ బాధ్యత. ఇందుకోసం శ్రీదుర్గా మల్లేశ్వర దేవస్థానం రూ.55 లక్షలు చెల్లించాలని ఇండెంట్ పెట్టడం ఎంతవరకు సబబు? కార్పొరేషన్ శానిటేషన్ విభాగంలో పనిచేయని పర్మినెంట్ శానిటరీ వర్కర్లు భారీగా ఉన్నారు. మస్టర్లు వేయించుకుంటూ తమ స్థానంలో జీతాలకు వేరేవారిని పెట్టుకుని పనిచేయిస్తుంటారు. అలాంటి వారితో కనీసం దసరా ఉత్సవాల్లో అయినా పనిచేయించాల్సింది పోయి దేవస్థానాన్ని డబ్బు అడగడం ఎంతవరకు కరెక్ట్ అనే వాదన వినిపిస్తోంది.

4,500 మంది పోలీసు బందోబస్తుకు రూ.కోటి

ఈ దసరా ఉత్సవాల్లో 4,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు దేవస్థానానికి సమాచారం ఇచ్చారు. కిందటి ఏడాది పోలీసు శాఖకు దేవస్థానం రూ.85 లక్షలు చెల్లించింది. ఈ ఏడాది వారి ఇండెంట్ బడ్జెట్ రూ.కోటికి పెరిగింది. తిరుమల బ్రహ్మోత్సవాల్లో కూడా వందల సంఖ్యలో తప్ప వేలసంఖ్యలో పోలీసులు ఉండరు. అలాంటిది 4,500 మంది ఎందుకో తెలియని పరిస్థితి. దీనికోసం రాష్ట్ర నలుమూలల నుంచి ఆయా స్టేషన్ల నుంచి పోలీసులను రప్పిస్తున్నారు. తెలంగాణాలో జరిగే సమ్మక్క సారక్క జాతరకు ఇంతకంటే ఎక్కువ సంఖ్యలోనే పోలీసులు విధులు నిర్వహిస్తారు. కానీ, అక్కడి కమిటీ వారికి నయాపైసా చెల్లించదు.

మత్స్యశాఖ ఇండెంట్ రూ.35 లక్షలట..!

మత్స్యశాఖ రూ.35 లక్షలకు ఇండెంట్ పెట్టింది. ఫెర్రిఘాట్ దగ్గర బోట్లు, జాలర్లు, గజ ఈతగాళ్లను పెట్టడంతో పాటు లైఫ్ జాకెట్లు, రేడియం స్టిక్కర్లు, ఇతర స్టేషనరీ కొనుగోలు కోసం ఈ ఇండెంట్ పెట్టడం గమనార్హం. దసరా ఉత్సవాలకు, ఫెర్రిఘాట్‌కు సంబంధమేమిటో అర్థంకాని పరిస్థితి. ఉత్సవాలకు సంబంధించిన కార్యక్రమాలేవీ అక్కడ జరగవు. కిందటి మిగతా 4లో..

గురుతర బాధ్యత

- జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న పలువురు ఉపాధ్యాయులు
- పిల్లలకు పాఠాలు తేలిగ్గా అర్థమయ్యేలా కళారూపాలు, ఎగ్జిబిషన్లు
- సేవా కార్యక్రమాల్లోనూ ముందుండి మార్గదర్శకంగా..
- క్రీడల్లోనూ రాణిస్తూ.. పోటీల్లో పతకాలు సాధిస్తూ..
- నేడు గురుపూజోత్సవం


కాజ జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు వినూత్నంగా పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు మేకా రాణి

ఓ చేత్తో బెత్తం పట్టుకుని, మరో చేత్తో పుస్తకం పట్టుకుని పాఠం చెప్తే పని అయిపోయిందనుకోలేదు. ప్రశ్నలకు జవాబులు చెప్పి, కంఠస్థం చేయించి సరిపెట్టుకోనూ లేదు. బెత్తంతో బెదిరించకుండా చాకచక్యంగా, సులభతరంగా పాఠాలు చెప్పి గురుతర బాధ్యతను రెండు భుజాలపై వేసుకున్నారు ఆ ఉపాధ్యాయులు. కళారూపాలతో, సైన్స్ ఎగ్జిబిషన్లతో విద్యార్థులకు తేలిగ్గా అర్థమయ్యేలా పాఠాలు చెప్పినవారు కొందరైతే, సేవాగుణంతో ముందుకెళ్తూ, క్రీడోత్సాహంతో పతకాలు సాధిస్తూ అంతులేని పేరు సంపాదించినవారు కొందరు. అవార్డులు, రివార్డులతో సంబంధం లేకుండా విద్యార్థుల్లో విద్యాసక్తిని పెంచడానికి అహరహం కృషిచేస్తున్న గురువుల విజయ గాథలపై నేడు (శుక్రవారం) గురుపూజోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

6లో

- విజయవాడ, ఆంధ్రజ్యోతి


4లో

నిమ్మకూరులో బాలయ్య

నిమ్మకూరులో ఎన్టీఆర్, బసవ తారకం విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బాలయ్య, చిత్రంలో పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా



హుండీల కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో, అధికారులు

దుర్గమ్మ కానుకల ఆదాయం
31 రోజులకు రూ.4.57 కోట్లు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవస్థానం మహామండపం ఆరో అంతస్తులో లెక్కించారు. ఈవో వీకే శీనానాయక్, దేవదాయ శాఖ అధికారులు, ఏఈవోలు, ఆలయ సిబ్బంది, ఎస్పీఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, అమ్మవారి సేవాదారులు కానుకల లెక్కింపులో పాల్గొన్నారు. పకడ్బందీ బందోబస్తు మధ్య కానుకల లెక్కింపులో 31 రోజుల వ్యవధికిగాను రూ.4,57,31,258లు నగదు సమకూరింది. బంగారం 400 గ్రాములు, వెండి 7 కిలోల 600 గ్రాములు, 524 యుఎస్ఏ డాలర్లు, 70 ఇంగ్లాండ్ పౌండ్లు, 52 సింగపూర్ డాలర్లు, 60 ఆస్ట్రేలియా డాలర్లు, 590 సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (దిరాహమ్స్), 28 సౌదీ రియాల్స్, 300 ఒమన్ (బయాసా), 73 ఖతార్ రియాల్స్ 210 మలేషియా రిగ్గిట్స్, 115 యూరప్ యూరోలు, 6.1/3 కువైట్ దినార్స్, 10 న్యూజిలాండ్ డాలర్లు, 100 హాంకాంగ్ డాలర్లు, 270 కెనడా డాలర్ల చొప్పున విదేశీ కరెన్సీ కానుకగా వచ్చింది.


సందీప్ మాథుర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

కనకదుర్గమ్మ సేవలో రైల్వే జీఎం సందీప్ మాథుర్

ఇంద్రకీలాద్రి : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సందీప్ మాథుర్ గురువారం విజయవాడ దుర్గమల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. సిగ్నలింగ్, కార్యకలాపాలు, అంతర్జాతీయ ప్రాజెక్టుల్లో మూడు దశాబ్దాల అనుభవం సందీప్ మాథుర్‌కు ఉంది. ఆలయ ఈవో వీకే శీనానాయక్ ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద ఆశీస్సుల అనంతరం సందీప్ మాథుర్ దంపతులకి ఈవో అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.


హోంమంత్రి అనితకు జ్ఞాపికను అందజేస్తున్న మహిళలు

కార్యసిద్ధి మహాశక్తి గణపతిని దర్శించుకున్న హోంమంత్రి అనిత

విద్యాధరపురం : విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్‌లో డూండీ గణేష్ సేవాసమితి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత 72 అడుగుల కార్యసిద్ధి మహాశక్తిగణపతిని దర్శించుకున్నారు. గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, 72 అడుగుల ఏకో ఫ్రెండ్లీ మట్టి గణపతిని ఏర్పాటు చేయటంపై డూండీ గణేష్ సేవా సమితి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో డూండీ రాకేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సినీ, రాజకీయ రంగాల్లో నాన్నే ఆదర్శం

» ఎన్టీఆర్ తనయుడు నందమూరి బాలకృష్ణ



పామర్రు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సినీకళారంగం, రాజకీయ రంగంలో తనకు గురువైనా.. దేవుడైనా నాన్న ఎన్టీఆర్ అని హిందుపురం ఎమ్మెల్యే, హీరో నందమూరి బాలకృష్ణ అన్నారు. సినీ ప్రస్థానంలో 50 ఏళ్ల పూర్తిచేసుకుని, ప్రపంచ బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో తొలి తెలుగు హీరోగా అవార్డు దక్కించుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం స్వగ్రామమైన నిమ్మకూరుకు విచ్చేశారు. తొలుత గ్రామంలోని తల్లిదండ్రులు ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజాతో కలిసి నివాళులర్పించారు. గురుకుల పాఠశాల విద్యార్థులు స్వాగతం పలకగా నిమ్మకూరు ఆడపడుచులు హారతులిచ్చారు. అనంతరం విలేఖర్ల సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ, సినీ కళారంగంలో తన 50 ఏళ్ల ప్రస్థానంలో పద్మభూషణ్, వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సంపాదించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పదవులు తనకు ముఖ్యంకాదని వాటికే తాను అలంకారమన్నారు. తన విజయాలు పుణ్యదంపతులైన తల్లిదండ్రులకు, నిమ్మకూరువాసులకు, అభిమానులకు అంకితమన్నారు. హిందూపురం ఎమ్మెల్యేగా వరస విజయాలు ఇచ్చిన రాయలసీమను తన అడ్డాగా భావిస్తానన్నారు. నాడు దివంగత ఎన్టీఆర్, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గం భౌగోళికంగా నేడు ఎంతో ప్రాధాన్యత పొందిందన్నారు. హైందవ ధర్మానికి ప్రతిరూపంగా తీర్చిదిద్దిన అఖండ-2 చిత్రాన్ని కులాలకు ఆపాదించకుండా వీక్షించాలని ప్రేక్షకులను కోరారు. బంధువు నందమూరి శివరామకృష్ణ ఇంట్లో పలువురు అభిమానులు, టీడీపీ నేతలు ఆయనతో సెల్ఫీలు దిగారు.


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

శ్రీకాకుళేశ్వర ఆలయంలో పవిత్రోత్సవాలు

ఘంటసాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకాకుళేశ్వరస్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు బుధవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు జరిగే ఈ పవిత్రోత్సవాల పూజా కార్యక్రమాలను ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావు ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. గురువారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, ప్రాశన వాస్తు పూజ, అగ్నిమదనం, అగ్నిప్రతిష్ఠాపన, విశ్వశాంతికై ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అగ్నిహోత్రం భాస్కరాచార్యులు, ముక్తేవి వెంకట సత్యనారాయణాచార్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దసరాకు తిరుమల తరహాలో దర్శనాలు

» మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో భక్తుల రద్దీ నియంత్రణలో ఏవిధానం అమలు చేస్తున్నారో.. అదే తరహాలో దుర్గగుడి దసరా ఉత్సవాల సందర్భంగా అమలు చేయడానికి ప్రయత్నం చేయాలని, భక్తులకు సరైన సమాచారం అందించడానికి అన్నిచర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో దసరా మహోత్సవ ఏర్పాట్లపై గురువారం బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డిలో గల సమావేశపు హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మూలా నక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించడానికి వస్తున్నారని అందిన సమాచారం ప్రకారం.. అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. మహిళల సౌలభ్యం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంతో మహిళా భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుందని, అందుకు తగ్గట్టుగా అన్నిచర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. త్వరలో రెవెన్యూ, దేవదాయ, హోం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి తీసుకున్న నిర్ణయాల మేరకు ముందుకు వెళతామని మంత్రి ప్రకటించారు. దసరా ఉత్సవాలలో అన్ని శాఖల సమన్వయం కీలకమని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ అన్నారు. దేవస్థాన సిబ్బందికి అన్నిపనులపై అవగాహన ఉండాలని, ఈనెల 15 లోపు అన్ని పనులు పూర్తి కావాలని, దేవదాయ శాఖ నుండి అన్ని అనుమతులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉత్సవాలలో స్వచ్ఛంద సేవకుల పాత్ర కీలమని, వారికి శిక్షణ ఇచ్చి సేవల్లో వినియోగించుకోవాలని ఆదేశించారు. గతంలో కంటే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, వారి అవసరాలకు తగ్గట్టు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు అన్నారు. కొత్త హోల్డింగ్ ఏరియాలు, కంట్రోల్ రూమ్ వినియోగం, వెస్ట్ బైపాస్ వినియోగించుకొని ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడటం వంటివి చేస్తున్నట్టు సీపీ తెలిపారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా భక్తులకు పూర్తి సమాచారం అందేలా చూస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, ఈవో శీనానాయక్, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

7న మధ్యాహ్నం నుంచి దుర్గగుడి మూసివేత

ఇంద్రకీలాద్రి : ఈనెల7 ఆదివారం రాత్రి రాహుగ్రస్త పాక్షిక చంద్రగహణం సందర్భంగా దేవస్థాన వైదిక కమిటీ సూచనల మేరకు ఆగమ శాస్త్ర ప్రకారం ఆరోజు మధ్యాహ్నం 3.30 గంటల నుంచి అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాల కవాట బంధనం (మూసివేత) చేస్తున్నట్టు ఈవో వీకే శీనానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 8వ తేదీ సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తారు. స్నపనాభిషేకములు, అర్చనాది కార్యక్రములు నిర్వహించు సందర్భంగా ఆర్జిత సేవలు రద్దు చేస్తారు.

ప్రతిష్ఠాత్మకంగా విజయవాడ ఉత్సవ్ : ఎంపీ శివనాథ్


ఆవిష్కరిస్తున్న ఎంపీ శివనాథ్

వన్‌టౌన్ : దసరా నవరాత్రుల్లో ప్రతిష్ఠాత్మకంగా విజయవాడ ఉత్సవ్‌ను శివనాథ్ (చిన్ని) తెలిపారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఎంపీ కేశినేని శివనాథ్, ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్ భేటీలో దసరా నవరాత్రుల సందర్భంగా 11 రోజుల పాటు నిర్వహించనున్న విజయవాడ ఉత్సవ్ గురించి ఎంపీ వివరించారు. పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక వైభవానికి విజయవాడ వేదిక కానుందని, సినీ కళాకారులు, పద్య, గద్య నాటక ప్రదర్శనలు, 40 ఎకరాల్లో ఎగ్జిబిషన్ ప్రదర్శన ఆకట్టుకోనుందన్నారు. కృష్ణానదిపై కేరళ తరహా బోట్ రేసింగ్, ప్రకాశం బ్యారేజీ సిడ్నీ హార్బర్ బ్రిడ్జి తరహా బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని, గిన్నీస్ రికార్డు దిశగా ప్రదర్శనలు ఉంటాయని, దసరా అంటే విజయవాడ అని దేశమంతటా ప్రతిధ్వనించేలా ఉత్సవం జరుగుతుందని ఎంపీ పేర్కొన్నారు.

వైసీపీ హయాంలో నిధుల దుర్వినియోగం

» రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కోనేరు సెంటర్‌లో భారీ ర్యాలీ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని, ఐదేళ్లపాటు అభివృద్ధి కార్యక్రమాలు వెనక్కి వెళ్లిపోయాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు సద్వినియోగం అవుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. మచిలీపట్నంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పనులు వేగవంతంగా నడుస్తున్నాయన్నారు. చిన్నపోర్టుల నిర్మాణానికి కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిందన్నారు. రైల్వేలైన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందని, ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసిందన్నారు. మచిలీపట్నం-తిరుపతి రైలు ప్రతిరోజూ నడిపేందుకు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. బందరు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆంధ్ర బ్యాంక్ వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభిసీతారామయ్య స్మారక భవనానికి అనుమతులు, నిధులు విడుదలయ్యేందుకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టేందుకు పార్టీ తరఫున ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. మచిలీపట్నం పోర్టు పనులు త్వరలో పూర్తవుతాయని, పోర్టు అనుసంధాన పరిశ్రమల ఏర్పాటుకు, యువతకు ఉద్యోగావకాశాలు లభించేందుకు కృషి చేస్తామన్నారు. మచిలీపట్నంకు స్వదేశీ దర్శన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.11 కోట్లు విడుదల చేసిందని, త్వరలో పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఆర్థిక వెసులుబాటు

దేశంలో జీఎస్టీ తగ్గింపుతో లక్షలాది పేదలకు ఎంతో ఊరట కలిగిందని మాధవ్ అన్నారు. జీఎస్టీ రేట్లను తగ్గించడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు ఏర్పడుతుందన్నారు. 22 జిల్లాల్లో సారథ్యం పూర్తి చేశానని, చివరగా కృష్ణాజిల్లాకు వచ్చానన్నారు. కేంద్ర ప్రభుత్వం యూరియా విడుదల చేసినా రైతులకు చేరడం లేదన్నారు. బందరు రోల్డ్‌గోల్డ్, పెడన కలంకారీ వస్త్రాలు, బందరు లడ్డూకు, మార్కెటింగ్ పెరిగేందుకు అవకాశాలు ఏర్పడతాయన్నారు. రానున్న కాలంలో మన ఊరు - మన జెండాప్రారంభిస్తామని కార్యకర్తలు భాగస్వామ్యం కావాలన్నారు. భవిష్యత్‌లో బీజేపీ నేతలు మునిసిపల్ కార్పొరేషన్, పంచాయతీలకు పోటీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్, అధికార ప్రతినిధి బుచ్చిబాబు, జిల్లా అధ్యక్షుడు తాతినేని శివరాం, నేతలు పాల్గొన్నారు.

బందరులో ఘన సత్కారం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మొదటిసారిగా బందరు వచ్చిన సందర్భంగా పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. గజమాలలతో సత్కరించారు. వినూత్న రీతిలో గీత కార్మికులు వేదికపైకి వచ్చి స్వాగతం పలకడం విశేషం.

బీజేపీ ఆధ్వర్యంలో బందరు పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కోనేరుసెంటర్ నుంచి జిల్లా పరిషత్ సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ట్రాక్టర్లు, ఆటోలు, బైక్‌లతో ఈ ర్యాలీ సాగింది. పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యూరియా విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లాలో రైతుల అవసరాల మేరకు పుష్కలంగా అందుబాటులో ఉందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి ఎరువులు విస్తారంగా దిగుమతి అయ్యాయని, కేంద్రం 53 వేల టన్నులను విడుదల చేసిందని, ప్రతి రైతుకు ఎరువులు సరఫరా అయ్యేలా పటిష్ఠ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా రైతులకు ఎరువులు అందిస్తోందని, యూరియాపై వస్తున్న అపోహలు నమ్మవద్దని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం..

» 12 మంది సచివాలయ సిబ్బందికి నోటీసులు

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామ పరిధిలోని సచివాలయాల్లో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు సిబ్బందికి గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎండీవో) విగ్గిన్స్ షోకాజ్ నోటీసులు జారీచేశారు. సచివాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సి ఉండగా.. నున్న గ్రామం సచివాలయం-1, 2 పరిధిలో పనిచేసే కొందరు సిబ్బంది ఉదయం 11 గంటలు దాటినా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ఈ విషయమై గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో ఎండీవో విగ్గిన్స్ రెండు సచివాలయాల్లో సమయానికి విధులకు హాజరుకాని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది వివరాలు సేకరించారు. వివిధ విభాగాల్లో పని చేస్తున్న మొత్తం 12 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీచేశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

» జేసీ గీతాంజలిశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని జేసీ గీతాంజలిశర్మ గృహనిర్మాణ సంస్థ అధికారులను, నియోజకవర్గాల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశపుహాలులో గురువారం జిల్లాలోని గృహనిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో గృహనిర్మాణాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. అధికారులకు గత సమావేశంలో ఇచ్చిన టార్గెట్‌లను చేరుకోలేదన్నారు. గృహనిర్మాణాలను వేగవంతం చేసేందుకు లబ్ధిదారులు, కాంట్రాక్టర్లతో అధికారులు తరచూ సమావేశాలు నిర్వహించి పనులను వేగవంతం చేయాలన్నారు. అధికారులు లే అవుట్‌లను సందర్శించి అక్కడ మౌలిక వసతులు, అప్రోచ్ రహదారుల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. గృహనిర్మాణసంస్థ ఇన్‌చార్జి పీడీ పోతురాజు, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, పౌరసరఫరాలసంస్థ జిల్లా మేనేజర్ శివరాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

» బస్సు ఢీకొని భవన నిర్మాణ కార్మికుడి మృతి



ప్రమాదానికి కారణమైన బస్సు

జగ్గయ్యపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం పనికి వచ్చిన వృద్ధుడైన తాపీ మేస్త్రీని మృత్యువు ఆర్టీసీ బస్సు రూపంలో కబళించింది. బస్టాండ్ లోపలకు వస్తున్న బస్సు ఢీకొట్టడంతో టైరుకింద పడి దుర్మరణం పాలైన సంఘటన జగ్గయ్యపేటలో గురువారం ఉదయం జరిగింది. పెనుగంచిప్రోలు మండలం పాత ముండ్లపాడు గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ (భవన నిర్మాణ కార్మికుడు) షేక్ మస్తాన్ (64) రోజూ జగ్గయ్యపేటలో చెరువుబజార్ వద్ద అడ్డాకు పనికోసం వస్తుంటాడు. గురువారం ఉదయం 7.30కి జగ్గయ్యపేట వచ్చి బస్టాండ్ దాటుతుండగా జగ్గయ్యపేట నుంచి బూదవాడ వెళ్లేందుకు బడి బస్సు లోపలకు వస్తు ఢీకొట్టడంతో వెనుక టైర్‌కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆర్టీసీ అన్‌కాల్స్ డ్రైవర్ శ్రీను డ్రైవింగ్ చేస్తు మస్తాన్‌ను ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయిన దృశ్యాలు సీసీటీ ఫుటేజీలో స్పష్టంగా కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆసుపత్రి వద్ద బంధువుల రోదనలతో విషాదవాతావరణం నెలకొంది. డ్రైవర్ శ్రీనును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గణేశ్ మండపం చెంత మాంసాహారమా!

» కొనసాగుతున్న ధార్మిక సంఘాల నిరసన

» మొండితోక సోదరుల నిర్వాకంపై టీడీపీ, బీజేపీ ఆగ్రహం

నందిగామ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వైఎస్ వర్ధంతి సందర్భంగా ఈనెల 2న వినాయక పందిరి పక్కన మాంసాహార భోజనాలు పెట్టడంపై హిందూ ధార్మిక సంఘాలు నిరసన కొనసాగిస్తున్నాయి. ఆ పార్టీ శాసన మండలి సభ్యుడు మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావులు స్వయంగా మాంసాహారాన్ని వండించి ప్రజలకు వడ్డించడం చర్చనీయాంశమైంది. మూడురోజులుగా బీజేపీ, టీడీపీలతో పాటు పలు ధార్మిక సంఘాలు నిరసన తెలుపుతున్నాయి. మొండితోక సోదరులు దీనిపై స్పందించక పోగా తప్పును సమర్థించుకొనే ప్రయత్నం చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది.

ఈ ఘటనపై నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాదల రమేష్ మాట్లాడుతూ, హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాల్సిన వ్యక్తులు ఇంత నీచంగా ప్రవర్తించడం హేయమన్నారు. తక్షణమే మొండితోక సోదరులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు ధార్మిక సంఘాల ప్రతినిధులు సైతం మొండితోక సోదరులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అడ్డుకున్నా లెక్క లేకుండా స్వామి ఎదుట మాంసాహారం తీసుకొని హిందువుల మనోభావాలు దెబ్బతీశారని ఆరోపిస్తున్నారు. అపచారానికి పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి తక్షణమే అదుపులోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

యూరియాపై కదలిక

(3వ పేజీ తరువాయి)

గ్రోమోర్ ఎరువుల దుకాణం వద్ద మీడియాతో కలెక్టర్ మాట్లాడారు. యూరియా భవిష్యత్తులో దొరకదనే కారణంతో రైతులు యూరియా కొనుగోలుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. రైతులకు కావాల్సిన సమయంలో యూరియాను అందుబాటులో ఉంచేందుకు ప్రణాళికను రూపొందించామన్నారు. జిల్లాలో 27 వేల టన్నుల యూరియాను ఇప్పటి వరకు విక్రయించామని తెలిపారు. బయటి జిల్లాల నుంచి రెండు రోజుల్లో 500 టన్నుల యూరియాను తెచ్చుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. యూరియా లభ్యతపై రైతులు కంగారు పడవద్దని ఆయన సూచించారు. జిల్లాకు మూడు, నాలుగు రోజుల్లో మూడు వేల టన్నుల యూరియాను ఎరువుల కంపెనీల నుంచి దిగుమతి చేసుకుంటామన్నారు. యూరియాను బ్లాక్‌లో పెట్టి అధిక ధరలకు విక్రయించే వారిపై నిఘా ఉంచామన్నారు. ఇప్పటి వరకు ప్రత్యేక అధికారులు 258 ప్రాంతాల్లో తనిఖీలు చేశారని తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన 120 టన్నుల యూరియాను సీజ్ చేశామన్నారు. ఒకరిపై కేసు నమోదు చేయడంతో పాటు 6-ఎ కేసులు 11 నమోదు చేయడం జరిగిందన్నారు. ఎకరానికి పంట చేతికొచ్చే సమయానికి 100 కిలోల యూరియాను వినియోగించాల్సి ఉందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా అవసరాన్ని బట్టి జిల్లాకు యూరియాను తీసుకువస్తామని కలెక్టర్ వివరించారు. ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.పద్మావతి, జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, గుడివాడ ఏడీఏ ఎస్.కవిత, తహసీల్దార్ కిరణ్, ఏవో బోలెం అనంతలక్ష్మి, వీఏఏ మౌనిక పాల్గొన్నారు.

అమ్మ సొమ్మంటే అలుసా!

(3వ పేజీ తరువాయి)

ఉత్సవాల్లోనూ రూ.35 లక్షలు తీసుకున్నారు. అప్పుడు కొన్న లైఫ్ జాకెట్లు, రేడియం స్టిక్కర్లు ఏమయ్యాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. కనీసం దేవస్థానానికి కూడా అప్పగించకుండా మళ్లీ కొత్తగా ఇండెంట్ పెట్టడం విడ్డూరమే. ఫీడర్లు పెడుతున్నామని విద్యుత్ శాఖ, తెప్పోత్సవం, ప్రకాశం బ్యారేజీపై లైటింగ్ కోసమని ఇరిగేషన్ శాఖ, బారికేడింగ్ ఏర్పాట్ల కోసం ఆర్అండ్‌బీ.. ఇలా ఏదో ఒక శాఖ అవసరం ఉన్నా, లేకపోయినా దేవస్థానం సొమ్మును ఖర్చు చేసేందుకు ఇండెంట్లు పెట్టడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


షేక్ అక్బర్ బాషా ఏర్పాటు చేసిన వినాయకుడి మండపాన్ని సందర్శించిన విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

వెల్లివిరిసిన మతసామరస్యం

» గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో ముస్లిం కుటుంబం

(ఆంధ్రజ్యోతి, ఘంటసాల) : అన్ని మతాల సారాంశం ఒక్కటే అన్న భావనతో ఐక్యతను చాటుకుంటున్నారు. కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన ముస్లిం కుటుంబం హిందువుల పూజలు చేస్తూ అందరి మన్ననలు పొందారు. గ్రామానికి చెందిన షేక్ అక్బర్ బాషా, భార్య షర్మిల కుమారుడు హుస్సేన్‌లు వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేసి భక్తి భావాన్ని చాటుకున్నారు. గత 15 సంవత్సరాల క్రితమే అయ్యప్పమాలను ధరించారు. చేస్తున్న వ్యాపారాలకు సాయినాథుని పేరు పెట్టుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో గణనాథునికి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజులుగా పూజలు నిర్వహిస్తూ గ్రామ ప్రముఖుల ప్రజల మన్ననలు పొందారు.

బాషా కుటుంబాన్ని అభినందించిన చలసాని, రంగనాథ బాబు

ఘంటసాల గ్రామంలో ముస్లిం కుటుంబ సభ్యుడైన షేక్ అక్బర్ బాషా వినాయక ఉత్సవాలు నిర్వహిస్తుండటంతో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని అంజనేయులు, ప్రవాస భారతీయులు గొర్రెపాటి రంగనాథ్ బాబులు అభినందించి సత్కరించారు.

బుసక తవ్వొద్దు

(3వ పేజీ తరువాయి)

సముద్రం వెంబడి ఉన్న ఎత్తయిన బుసక మేట కారణంగా గ్రామాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకు రాలేదని గుర్తు చేశారు. గ్రామాలకు రక్షణ కవచంగా ఉన్న బుసకమేటలను ప్రస్తుతం తవ్వేస్తుడటంపై ఆందోళన వ్యక్తం చేశారు. బుసకను తవ్వే అక్రమార్కులు ధనాపేక్షనే చూసుకుంటున్నారని, గ్రామాలకు పొంచి ఉన్న ముప్పును పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

చెడ్డపేరు తెస్తే ఉపేక్షించబోం

బుసక తవ్వకాలపై మంత్రి రవీంద్ర స్పందించారు. సముద్ర తీర గ్రామాల్లో కొందరు బుసకను తవ్వేస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నాయకులు తమ తీరును మార్చుకోవాలని, లేకుంటే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. ప్రతిపక్ష నాయకులతో అంట కాగవద్దని చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ భూముల్లో బుసక తవ్వకాలు చేస్తే గ్రామస్థులంతా ఐక్యంగా నిలబడి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని సూచించారు.

గ్రామాల్లో జోరుగా బుసక తవ్వకాలు

మచిలీపట్నం నార్త్ మండలం పరిధిలోని కరగ్రహారం, క్యాంప్‌బెల్‌పేట, గోపువానిపాలెం, తపసిపూడి, మంగినపూడి, తాళ్లపాలెం తదితర గ్రామాల నుంచి వర్షాకాలంలోనూ ప్రభుత్వ భూముల నుంచి బుసకను తవ్వి విక్రయించేస్తున్నారు. సముద్ర తీరం వెంబడి పోర్టు నిర్మాణం కోసం రైతులు ముడాకు విక్రయించిన భూముల్లో నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా బుసకను తవ్వేస్తున్నారు. ముడా కార్యాలయంలో పనిచేసే సర్వేయర్‌లు చూపిన ముడా భూముల్లో అక్రమార్కులు రాత్రి, పగలు తేడా లేకుండా బుసక తవ్వేసి విక్రయాలు జరుపుతున్నారు. బుసక తవ్వకాలను పరిశీలించేందుకు వెళ్లిన ముడా అధికారులను సైతం ఇటీవల కాలంలో బెదిరించి మరీ, బుసక తవ్వకాలను మరింత విస్తృతం చేశారు. మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతిరోజు వందలాది ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా బుసకను అడ్డు, అదుపు లేకుండా తరలించేస్తున్నారు. దీంతో ఈ అంశం వివాదాస్పదంగా మారింది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ సముద్రతీరం వెంబడి గ్రామాల్లోని ప్రభుత్వ భూముల నుంచి బుసక తవ్వకాలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ, కూటమి నాయకులు కూడబలుక్కుని మరీ ప్రభుత్వ భూముల నుంచి బుసకను తవ్వి విక్రయించేస్తున్నారు. ఇటీవల కాలంలో బుసక తవ్వకాల అంశం వివాదాస్పదం కావడం, వర్షాకాలంలోనూ ముడా భూముల నుంచి బుసకను తవ్వి విక్రయించడం, ఈ అంశం తలనొప్పిగా మారడంతో మంత్రి రవీంద్ర సముద్రతీర గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేయడం గమనార్హం. కరగ్రహారం, క్యాంప్‌బెల్‌పేట గ్రామాలతో పాటు, గోపువానిపాలెం, తపసిపూడి గ్రామాల్లోనూ జోరుగా బుసకతవ్వకాలు జరుగుతున్నాయని, ఈ గ్రామాల్లోనూ బుసక తవ్వకాలను నిలిపివేస్తే తీరప్రాంత గ్రామాలను ప్రకృతి విపత్తుల నుంచి కాపాడినట్లవుతుందని సముద్రతీరం వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు అంటున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

ఎస్టీలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే యార్లగడ్డ


పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

విజయవాడ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనుకబడిన ఎస్టీలకు అండగా ఉంటామని, వారికి ఆర్థిక భరోసా కల్పిస్తామని గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. మంగళాపురంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్లో గురువారం 52 మంది ఎస్టీలకు ఎమ్మెల్యే యార్లగడ్డ ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీలు నివాసం ఉంటున్న ప్రాంతంలో రూ.70 లక్షలతో విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ నరసింహారావు, తాహసీల్దార్ సుగుణ పాల్గొన్నారు.

తాడిగడప అభివృద్ధే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): వచ్చే నాలుగేళ్లలో తాడిగడప మునిసిపాలిటీలో రోడ్లన్నీ పూర్తి చేసి తీరుతామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెనమలూరు సాలిపేట గంగూరు 60అడుగుల రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. 6.2కోట్ల సీఆర్డీయే నిధుల వ్యయంతో నిర్మించనున్న ఈ రోడ్డు పూర్తయితే చాలా సులభంగా పెనమలూరు, పోరంకి వాసులు గంగూరు ట్రిసెంటరును చేసుకొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సనత్ నగర్ నుంచి పీవీపీ కళాశాల వరకు రోడ్డువేసే కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు మహదేవపురం కాలనీ వరకు పూర్తిగావచ్చిందని, అక్కడి నుంచి పీవీపీ వరకు ఆరేడు కోట్ల ఖర్చుతో పూర్తయ్యే అవకాశం ఉందని త్వరలోనే దానికీ టెండర్లు పిలిచి రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. దీంతో పోరంకి, కానూరు ప్రజలు కొద్ది సమయంలోనే ఎన్టీఆర్ సర్కిల్, ఎన్టీఆర్ యూనివర్శిటీ పరిసరాలకు చేరుకుంటారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే ఈరోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసి రోడ్ల పనులు ప్రారంభించామని, అయితే ప్రభుత్వం మారడంతో ఇవన్నీ అటకెక్కాయన్నారు.ఆటోనగర్ టెర్మినల్ నుంచి ఏలూరు రోడ్డును కలిపే రోడ్డు, బల్లెంవారి వీధిని కలిపే రోడ్డుకు కోట్ల రూపాయలతో టెండర్లు తయారయ్యాయని, టెండర్లు ఖరారు అయిన వెంటనే రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మహానాడు రోడ్డును పోరంకి నిడమానూరు రోడ్డును కలిపే రోడ్డు నిర్మాణానికి కూడా టెండర్లు పిలిచామని తెలిపారు.


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ప్రతిక్షణం అభివృద్ధి గురించే ఆలోచిస్తున్నామని, ప్రజల దీవెనలు టీడీపీ కూటమి ప్రభుత్వానికి ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ నాయకులు ఆనంద్‌ప్రసాద్, నరేంద్ర, సంగెపు రంగారావు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న శంకరబాబు దంపతులు

సీఎం చంద్రబాబును కలిసిన శంకరబాబు దంపతులు

కానూరు, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): మొట్టమొదటి సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 సంవత్సరాలైన సందర్భంగా చంద్రబాబుని బుధవారం రాత్రి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు సతీసమేతంగా సచివాలయంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శంకరబాబు తన భార్య శ్రీదేవితో కలిసి జ్ఞాపికను అందజేశారు. తనకు విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు. దీనికి సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని శంకరబాబు గురువారం విలేకరులకు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం 7న

కానూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కానూరులోని అన్నే శివనాగేశ్వరరావు అరుణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈనెల 7వ తేదీన పాఠశాల ఆవరణలో జరగనుంది. 2001-2025 వరకు చదివిన పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళంలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పాఠశాల పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త అన్నే శివనాగేశ్వరరావు గురువారం కానూరులో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. సమావేశంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బాపులపాడు మండల కార్యాలయంపై లోకాయుక్తకు ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్ :బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంపై వీరవల్లికి చెందిన చికెన్ దుకాణం వ్యాపారి షేక్ హుజేర్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. రెండు నెలల కిందట లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా ఈ నెల 23న సమాధానం తెలిపాలని మండల పరిషత్‌కు నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది. గతేడాది మే 29 సమాచార హక్కు చట్టం కింద ఎంపీపీ వై.నగేష్ పాలక వర్గం బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జమా ఖర్చులు వివరాలు కావాలని కోరగా మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో లోకాయుక్తను ఆశ్రయించినట్లు హుజేర్ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ సురక్షితం

వన్‌టౌన్: కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకోవటానికి కంకిపాడు నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజి వద్దకు వచ్చిన మహిళ (39)ను వన్‌టౌన్ పోలీసులు కాపాడిన సంఘటన గురువారం జరిగింది. కంకిపాడు మండల కార్యాలయం రోడ్డులో ఆలూరి ప్రియాంక కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె భర్త రాఘవేంద్ర మధ్య గొడవల నేపథ్యంలో మనస్థాపం చెందిన ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు ప్రకాశం బ్యారేజీ వద్దకు వచ్చింది. కంకిపాడు పోలీసులు ఎన్టీఆర్ జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం తెలియపరిచారు. కృష్ణలంక, వన్‌టౌన్ పోలీసులు అప్రమత్తమై ఆమె కోసం బస్టాండ్, పద్మావతి ఘాట్, సీతమ్మవారి పాదాలు, కాళేశ్వరరావు మార్కెట్, ప్రకాశం బ్యారేజీ, తదితర ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో ఆమె ప్రకాశం బ్యారేజీ వద్ద ఉండటం గమనించిన వన్‌టౌన్ పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు తెలియపరచి వారు వచ్చిన తరువాత వారికి అప్పగించారు.

సాగర్ జలాలతో చెరువులను నింపుకోవాలి

● ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ఎడమకాలువ 3వ జోన్‌కు తెలంగాణా నుంచి వస్తున్న సాగర్ వరద జలాలతో ఆయకట్టులోని తాగునీటి చెరువులను నింపుకోవాలని ఎన్ఎస్ ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ సూచించారు. ఇటీవల సాగర్ వరద జలాలను 3వజోన్‌కు విడుదల చేసిన నేపథ్యంలో గురువారం రావిచర్ల వద్ద బాపులపాడు మేజర్ రెగ్యులేటర్ వద్ద చేరుకున్నాయి. ఈ రెగ్యులేటర్ ద్వారా దిగువ ప్రాంతాలకు సాగర్ వరద జలాల విడుదలను రైతులు, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద జాలలను సద్వినియోగం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారన్నారు. వీటితో


నీటి విడుదలను పరిశీలిస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ

నూజివీడు మేజర్, కేసరపల్లి మైనర్ ఆయకట్టులోని చెరువులను నింపాల్సి ఉందన్నారు. ఎన్ఎస్‌పీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.సీతారావమ్మ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసన్నకుమార్, నవీన్‌బాబు, సర్పంచ్ కాపా శ్రీనివాసరావు, నీటి సంఘ అధ్యక్షుడు పల్లగాని నాగేంద్రరావు, తమ్మిశెట్టి రాంబాబు, మల్లవల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు షేక్ జాన్‌భాషా, ఆయకట్టుదారులు అక్కినేని కృష్ణాజీ, చక్రధర్, పాల్గొన్నారు.

వైభవంగా గణేశ్ నిమజ్జనాలు

కంకిపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు రైతు బజారు వద్ద తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి చవితి పందిళ్లను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్రామ్ సందర్శించారు. అన్నదానం చేశారు. టీడీపీ నేతలు హరికృష్ణ, శ్రీనివాసరావు, వెంకటరమణ,పాల్గొన్నారు.

ఉయ్యూరు :ఉయ్యూరులో ఏర్పాటుచేసిన మండపాల్లో తొమ్మిదవ రోజున గణేశ్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకు వెళ్లి పుల్లేరు కాల్వలో నిమజ్జనం చేశారు. ఆంజనేయస్వామి గుడివద్ద ఏర్పాటుచేసిన మండపంలో గురువారం అన్నసమారాధన మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు.

గన్నవరం : రాయ్‌నగర్‌లోని ఎన్టీఆర్ రోడ్డులో గణేష్ ఉత్సవ్ సమితి ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న గణపతి నవరాత్రులు గురువారం ఘనంగా ముగిశాయి. లడ్డూ ప్రసాదాన్ని వేలంపాటలో రాఘవేంద్ర ప్రాజెక్ట్స్ అధినేత కిషోర్ రూ.69,116కు దక్కించుకున్నారు. గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగింపుగా తీసుకువెళ్లి ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.


వినాయకుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న బోడె వెంకట్రామ్

ఉయ్యూరు :వీరమ్మతల్లి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన బాల గణేశ్ మండపంలో గురువారం మహిళలు సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

తగ్గిన వరద .. బయట పడ్డ శివాలయం

కంకిపాడు: గత 40 రోజులుగా వర్షాల కారణంగా మద్దూరు, కాసరనేని వారి పాలెంలోని కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలు నీట మునిగాయి. కాసరనేనివారి పాలెంలో వరద తగ్గడంతో శివాలయం బయట పడింది.

సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు

● డీడీఏ జ్యోతిరమణి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : వాతావరణ మార్పులకు అనుగుణంగా అరుతడి లాంటి సస్యరక్షణ చర్యలతో వరి పంటలో అధిక దిగుబడులు పొందవచ్చని డీడీఏ జ్యోతిరమణి సూచించారు. కాకులపాడులో గురవారం వ్యవసాయశాఖ, జిల్లా వనరుల కేంద్ర ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. . ఈ కార్యక్రమంలో ఏడీఏ(అసిస్టెంట్ డైరెక్టర్) శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ వనరులకేంద్ర ఏవో పద్మజ, మండల వ్యవసాయశాఖ అధికారి రంగనాథ్‌బాబు, వీఏఏ సునీత, పూర్ణ, అనూహ్య. తదితరులతో పాటు చలసాని శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

గన్నవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అతి పవిత్రమైనదని గుడివాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కొండా రవి కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సిల్వర్‌జూబ్లీ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. డీవైఈవో రవికుమార్, ఎంఈవో-2 ఎం. కమలను ఉపాధ్యాయులు సత్కారించారు. తొలుత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం కె. సువార్త రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రసాదంపాడు: విజయవాడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలనం చేశారు. అనంతరం విద్యార్థినీవిద్యార్థులు ఉపాధ్యాయులను అనుకరిస్తూ చేసిన స్కిట్ చూపరులను అలరించింది.


నగదు బహుమతిని ప్రదానం చేస్తున్న పవన్ చంద్

10,12 తరగతులలో వంద శాతం మార్కులు సాధించి డానికి కారణమైన ఉపాధ్యాయులకు క్యాష్ అవార్డును పాఠశాల డైరెక్టర్ పవన్ చంద్ అందజేశారు. పాఠశాల ప్రొవైస్ చైర్మన్ నరేంద్రబాబు, పాఠశాల డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ భాటియా పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లి, రేమల్లె హైస్కూళ్లలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. వీరవల్లి హెచ్ఎంలు లూథర్ పాల్, నిర్మల సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


నాగరాజు

ఈశ్వరరావు

కుమార్‌బాబు

జ్వానేష్

రత్నకుమారి

ఎం.సరళ

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు వీరే..

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రంగన్నగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బండ్లపల్లి నాగరాజుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. జిల్లా విద్యాశాఖ నుంచి గురువారం ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎంఈవోలు రాంబాలాసింగ్,విజయ్ అభినందించారు.

గన్నవరం: కేసరపల్లిలోని డాక్టర్ ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల లైవ్ స్టాక్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.ఈశ్వరరావు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.కళాశాల అసోసియేట్ డీన్ పీవీఎస్ కిషోర్‌లు అభినందించారు.

మండలంలోని నలుగురు ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరు శుక్రవారం మచిలీపట్నంలో జరిగే టీచర్స్‌డే కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తదితర ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. ముస్తాబాద మెయిన్ ఎంపీపీ పాఠశాల హెచ్ఎం కొమెర కుమార్‌బాబు, కోనేరు పాఠశాల ఉపాధ్యాయుడు దొప్పల జ్వానేష్, దావాజీగూడెం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుని రేమల్లె రత్నకుమారి, వీరపనేనిగూడెం ఎంపీపీ పాఠశాల హెచ్ఎం ఎం.సరళలు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన వారిలో ఉన్నారు. వీళ్లని గుడివాడ డీవైఈవో కొండా రవికుమార్, ఎంఈవో-2 ఎం.కమల, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ అభినందించారు.

ఉంగుటూరు:డాక్టర్‌సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రభుత్వం అందించే జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఉంగుటూరు మండలం, వెల్దిపాడు జడ్పీహైస్కూల్‌లో గ్రేడ్-2హెచ్ ఎంగా పనిచేస్తున్న తిమ్మరాజు సీతారామ్ ఎంపికైనట్లు ఎంఈవో జె.సాంబశివరావు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో నిత్యాన్నదానానికి విజయవాడ యనమలకుదురుకు చెందిన ఎన్.సాంబశివరావు, రాజ్యలక్ష్మి దంపతులు గురువారం అధికారులకు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. దుర్గగుడి అధికారులు దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం అధికారులు వారికి లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

చిరువ్యాపారులకు తోపుడుబండ్లు

పెనమలూరు: ఉప్పలూరు, తెన్నేరు గ్రామాలకు చెందిన వీధి వ్యాపారాలు చేసుకొనే చిరు వ్యాపారులు ఉప్పలూరి నాగేశ్వరరావు, కటికల పట్టాభిరాంలకు యువనేత బోడె వెంకట్రాం తోపుడు బళ్లను అందజేశారు. గురువారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకట్రాం మాట్లాడుతూ నిరుపేదల ఆర్థికాభివృద్ధికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు.

అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై శిక్షణ 9న

హనుమాన్‌జంక్షన్: బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 9న అడ్వాన్స్‌మెంట్ ఇండెక్సు(పీఏఐ2.0) పై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుమల త్రినాథరావు గురువారం ప్రకటనలో తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలి

గన్నవరం: ఉద్యోగులకు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ వెస్ట్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు డీఎస్ఎన్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జీవోస్ కార్యాలయంలో గన్నవరం తాలూకా యూనిట్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు వి.సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ డీఏ,పీఆర్‌సి, సీపీఎస్, సరెండర్ లీవ్‌లు ఇవ్వాలన్నారు. కార్యదర్శి పి.రమేష్, జి.రామకృష్ణ, ప్రసాద్, రాజశేఖర్, జయరాజు, వెంకటేశ్వరరావు, రత్నబాబు, పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా గంజాయి లాంటి మాదక ద్రవ్యాల వినియోగం, లైంగిక ఆకర్షణ వల్ల ఎయిడ్స్ లాంటి ప్రాణాంతక వ్యాధులకు గురయ్యే ప్రమాదముందని రాఘవేంద్రబాబు, జాస్మిన్‌రాణి హెచ్చరించారు. సింగన్నగూడెంలో గురువారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు.

వయోజనులకు అక్షరాస్యతపై శిక్షణ

ఉయ్యూరు :వారం రోజుల్లో నిరక్షరాస్యులను ఎన్ఆర్ పద్ధతిలో అలవోకగా తెలుసుకునేందుకు తెలుగు నేర్చుకునే పైలెట్ ప్రాజెక్ట్ ప్రభుత్వం అమలుచేస్తున్నట్లు జిల్లా వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు ఎండీ హాజీబేగ్ తెలిపారు. ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించారు. వారం రోజుల్లో నిరక్ష్యరాస్యులకు చదువు నేర్పేలక్ష్యంతో నిర్వహిస్తున్నామన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అభినందనీయం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సతీష్‌కుమార్


హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలను చేరువ చేయడం అభినందనీయమని వీహెచ్‌పీ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్ కుమార్ అన్నారు. ఎస్.ఎన్.పాలెం రోడ్డులోని మెడివ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆవరణలో గురువారం ఎండీ పంచకర్ల రమేష్ చక్రవర్తి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈఎన్‌టీ డాక్టర్ సుధ, ఆర్థోపెడిక్ డాక్టర్ అభిషేక్, గైనికాలజీ డాక్టర్ వినీల, చిన్నపిల్లల డాక్టర్ పవన్ సీతారాం, డెంటల్ డాక్టర్ స్పందన, డాక్టర్ నీహారిక ఆధ్వర్యంలో 236మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సుంకర బోస్, మేడికొండ బుచ్చిబాపయ్య, నందిగం స్వామి, బోయపాటి పూర్ణ, మాకినేని శ్రీనివాసరావు, అక్కినేని రాఘవేంద్రరావు, కలపాల రంగారావు, మూల్పూరి సురేంద్ర పాల్గొన్నారు.

హ్యాక్‌థాన్ పోటీల్లో సిద్ధార్థ వర్సిటీ విద్యార్థి ప్రతిభ

కానూరు, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి హ్యాక్‌థాన్ పోటీల్లో కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థి పిల్లి హనీష్ ప్రథమ బహుమతి సాధించారు. ఇటీవల పూణేలో ఇన్ఫోసిస్ సంస్థ నిర్వహించిన జాతీయస్థాయి హ్యాక్‌థాన్ పోటీల్లో సిద్ధార్థ వర్సిటీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం తుది సంవత్సరం విద్యార్థి పిల్లి హనీష్ బృందం ప్రథమ బహుమతి సాధించింది. ఈ బహుమతి కింద రూ.3లక్షల నగదును అందజేసింది. గురువారం కానూరులోని సిద్ధార్థ వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ వీసీ ఏవీ రత్నప్రసాద్, పరిశోధన, అభివృద్ధి, సాంకేతిక విభాగం డీన్ ఎం. సునీతలు పిల్లి హనీష్ బృందాన్ని అభినందించారు. ఈసందర్భంగా వీసీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి హ్యాక్‌థాన్‌ల వల్ల విద్యార్థుల్లో టీమ్ వర్క్, సమయ నిర్వహణ, సమస్యల పరిష్కార నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయన్నారు.


హనీష్‌ను అభినందిస్తున్న సిద్ధార్థ వర్సిటీ వీసీ వెంకటేశ్వరరావు

కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం నూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం డిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- » కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- » ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- » తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- » తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- » సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

గురుతర బాధ్యత

- » జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న పలువురు ఉపాధ్యాయులు
- » పిల్లలకు పాఠాలు తేలిగ్గా అర్థమయ్యేలా కళారూపాలు, ఎగ్జిబిషన్లు
- » సేవా కార్యక్రమాల్లోనూ ముందుండి మార్గదర్శకంగా..
- » క్రీడల్లోనూ రాణిస్తూ.. పోటీల్లో పతకాలు సాధిస్తూ..
- » నేడు గురుపూజోత్సవం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/జగ్గయ్యపేట/తిరువూరు/మచిలీపట్నం టౌన్/గుడివాడ రూరల్/కూచిపూడి): విద్యార్థులకు పాఠాలు అందరు ఉపాధ్యాయులు చెబుతారు. అర్థమయ్యేవారికి అర్థమవుతుంది లేకుంటే లేదు. కొంతమందిలో ఒకరో ఇద్దరో విద్యార్థుల కోసం అధిక సమయం కేటాయిస్తారు. మరికొంతమంది మాత్రమే తమ వద్ద చదివే ప్రతి విద్యార్థి ప్రయోజకులవ్వాలని ఆశిస్తూ తమ సర్వస్వం దారబోస్తారు. ఉమ్మడి జిల్లాలో అలాంటి ఉపాధ్యాయుల్లో కొంతమంది గురించి..



వరదలకు వాహనాలు, బ్రిడ్జిలు కొట్టుకుపోకుండా సైన్సు టీచర్ గార్లపాటి చంద్రశేఖర్ రూపొందించిన ప్రాజెక్టు

ప్రాజెక్టుల సార్ ఈ సైన్సు మాస్టార్

జగ్గయ్యపేట పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాలలో సైన్సుటీచర్ గార్లపాటి చంద్రశేఖర్ ప్రాజెక్టుల సార్‌గా పేరుగాంచారు. విద్యార్థులను పరిశోధన రంగంలోకి వెళ్లేలా సైన్సు బోధన, ఆవిష్కరణలుంటాయి. ఆయన ఆవిష్కరణలు దక్షిణభారత స్థాయి సైన్సు ఫెయిర్‌లో బహుమతులు అందుకున్నాయి. 1995లో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన ఆయన పట్టణంలో నాగమయ్య బజార్ పాఠశాలకు సొంత భవనం లేకపోవటంతో ఐదేళ్లపాటు అద్దె భవనంలో నిర్వహించి సొంత భవనానికి బీజం వేశారు. మక్కపేట యూపీ స్కూల్‌లో 50 మంది విద్యార్థులను 260 మందికి పెంచారు. విద్యార్థులతో 100కు పైగా ప్రాజెక్టులు చేయించారు. వర్షాల నుంచి పంటల రక్షించే ప్రాజెక్టు జాతీయస్థాయిలో ప్రశంసలందుకుంది. తన యూట్యూబ్ చానల్‌లో వేలాది మందికి సైన్సు ప్రాజెక్టులు, గణితావధానంపై చైతన్యం తెచ్చారు. భారీ వర్షాలు, వరదల్లో వాహనాలు, బ్రిడ్జిలు కొట్టుకుపోకుండా రూపొందించిన ప్రాజెక్టు పాండిచ్చేరిలో జరిగిన సైన్సు ఫెయిర్‌లో ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. 2024లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.


రక్తదానం చేస్తున్న హెచ్‌ఎం నేలవెల్లి రమేష్‌బాబు

సేవా గుణ సంపన్నుడు, రక్తదాత నేలవెల్లి

1996లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన నేలవెల్లి రమేష్ ప్రస్తుతం గండ్రాయి ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యా ప్రమాణాలు, దాతల సహకారంతో పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపరుస్తుంటారు. 1984 నుంచి ఇప్పటికి 97 సార్లు రక్తదానం చేసిన ఆయన రక్తదాతలను ప్రోత్సహిస్తుంటారు. ఉపాధ్యాయ మిత్ర సంస్థ ద్వారా పేద విద్యార్థులను ఆదుకోవటం, పర్యావరణ పరిరక్షణకు 200కి పైగా కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మ వరప్పాడు పాఠశాలను రూ.8లక్షలతో అభివృద్ధి చేయటంలో కీలకపాత్ర పోషించారు.


స్ట్రాంగ్‌మెన్ ఆఫ్ ఇండియా టైటిల్ అందుకుంటున్న గంటా వెంకటేశ్వర్లు

'పవర్'ఫుల్ పీఈటీ

వ్యాయామోపాధ్యాయుడిగా వచ్చిన జీతం మొత్తం పవర్ లిఫ్టింగ్‌కే అంకితం చేశారు చిల్లకల్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గంటా వెంకటేశ్వర్లు. వత్సవాయి మండలం భీమవరానికి చెందిన ఈయన 1987లో ఎస్జీఎస్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నప్పటి నుంచే పవర్ లిఫ్టింగ్‌లో రాటుతేలాడు. 2001 డీఎస్సీలో వ్యాయామోపాధ్యాయుడుగా రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు సాధించి పీఈటీగా ఎంపికైయ్యారు. పవర్ లిఫ్టింగ్‌లో దాదాపు 200 మందికి శిక్షణ ఇచ్చి సగానికి పైగా లిఫ్టర్లను జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. బాలుర హైస్కూల్‌కు రూ.4లక్షలదాకా వెచ్చించి పెయింట్లు, గ్రౌండ్‌కు మరమ్మతులు చేయించారు. బలుసుపాడు, గౌరవరంలో పోటీలకు సొంతడబ్బులు వెచ్చించారు. ఎస్జీఎస్ కళాశాల, డిపో గ్రౌండ్ పోటీల నిర్వహణ సైతం సొంత నిధులతోనే చేయించారు. 2022 నుంచి 2025 వరకు జాతీయ మాస్టర్స్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో చాంపియన్ షిప్‌ను గెలుచుకున్నారు. 2021లో ఆసియన్ పవర్‌లిఫ్టింగ్‌లోను చాంపియన్ షిప్‌ను గెలుచుకుని, స్ట్రాంగ్ మెన్ ఆఫ్ ఇండియా, ఆసియాగా నిలిచారు. పవర్‌లిఫ్టర్‌గా అద్భుత విజయాలు సాధించిన వెంకటేశ్వర్లుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది.

దళితవాడలో 'సుధా'మృతం


విద్యార్థులకు నూతన పదాలను నేర్పేందుకు తయారు చేసిన ఉపకరణంతో టీచర్ జయసుధ

జగ్గయ్యపేట మండలంలో కృష్ణా పరివాహక ప్రాంతమైన రావిరాల దళితవాడలో ఉపాధ్యాయిని తుమ్మలచర్ల జయసుధ విద్యామృతాన్ని పంచుతున్నారు. విద్యార్థుల విద్య, జ్ఞాపకశక్తి సామర్థ్యాలను గుర్తించి ఉపకరణాల ద్వారా విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాలకు వచ్చిన తొలి అర్ధగంట పిల్లల ఆసక్తిని గమనించి వారితో యాక్టివిటీస్ చేయిస్తున్నారు. నూరుశాతం హాజరు, క్రమశిక్షణ, యూనిఫారమ్ వేసుకురావటం, మధ్యాహ్న భోజనం అందరూ తినేలా చేయటానికి ఆమె ఎంతో కృషి చేశారు. ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ టీవీతో పాటు, తాను నిర్వహిస్తున్న జయాస్ టీచింగ్ టెక్నిక్స్ యూట్యూబ్ చానల్ ద్వారా పిల్లలతో పలు స్కిట్లను చేయించి వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. మెగా డీఎస్సీ అభ్యర్థులను ఎలా ఎదుర్కోవాలో ఇచ్చిన క్లాసులు యూట్యూబ్‌లో అనేకమందికి మార్గదర్శనం చేశాయి. పెళ్లై ఇద్దరు పిల్లలు కలిగాక బీఈడీ చేసి, డీఎస్సీలో ఉద్యోగం సాధించిన ఆమె ఎందరో మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. ఆమె చానల్‌కు 15వేల మందికి పైగా వీక్షకులున్నారు.


పఠనాసక్తిని పెంచేందుకు ఏర్పాటు చేసిన లైబ్రరీలో పిల్లలకు పుస్తకం పరిచయం చేస్తున్న టీచర్ నవీనా

విద్యాబోధనలో 'నవీన'ం

జగ్గయ్యపేట పట్టణంలో అట్టడుగు వర్గాలు నివసించే మిట్టగూడెం పాఠశాలలో పనిచేస్తూ వినూత్న పద్ధతుల ద్వారా విద్యాబోధన చేస్తూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల పట్ల ఆకర్షితుల్ని చేస్తున్నారు చిన్నపంగు నవీన. సింగిల్ టీచర్ స్కూల్‌కు హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కూతవేటు దూరంలో ప్రైవేట్ పాఠశాలలున్నా ప్రభుత్వ పాఠశాల బాట పట్టించారు. పిల్లలకు స్మార్ట్ టీవీ బోధనతో పాటు మొబైల్స్ దూరంగా ఉంచేందుకు లైబ్రరీ ఏర్పాటు చేసి కథల పుస్తకాలను ఏర్పాటు చేశారు. 1వ తరగతి పిల్లలను తన ఒడిలో కూర్చొబెట్టుకుని పాఠాలు చెబుతుంటారు. స్కూలంటే భయం పోగొట్టి రోజు వచ్చేలా చేశారు. తోడుగా ఒక వలంటీరును పెట్టుకుని తానే జీతం ఇస్తూ స్కూల్ నడుపుతున్నారు.

కళారూపాలతో గణిత బోధన




ఆమె గణిత ఉపాధ్యాయురాలు. అందరి ఉపాధ్యాయుల్లా పాఠాలు చెప్పామా వెళ్లామా అన్నట్లు ఉండరామె. పిల్లలతో ఆడుతుంది, పాడుతుంది, రంగులద్ది పాఠాలు బోధిస్తుంది మచిలీపట్నంలోని రైలుపేట మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయురాలు శివలెంక ఉష. పిల్లల్లో గణితమంటే భయంగా ఉంటుంది. వారికి ఆ భయాన్ని పోగొడుతూ, గణితాన్ని ఆటపాటలతో నేర్పుతోంది. పాఠశాల ఆవరణలోకి తీసుకెళ్లి కళా నైపుణ్యాలతో బోధిస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్న ఆమె గణితాన్ని విద్యార్థులకు నూతన ఒరవడిలో బోధిస్తున్నారు. కూచిపూడి నర్తకి అయిన ఉష విద్యార్థులకు తన హావభావాలతో, కళా నైపుణ్యాలతో గణితాన్ని అలవోకగా బోధిస్తూ గణితక్లబ్‌ను ఏర్పాటుచేశారు. చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో ఈమె గణితం బోధిస్తున్న సమయంలో కొందరు విద్యార్థులు నూటికి నూరు మార్కులు సాధించి లక్షల్లో ప్రైజ్‌మనీ సాధించారు.

విద్యాశ్రామికుడు రాంప్రదీప్



టెన్త్ విద్యార్థులు ఇంగ్లీషు సులభంగా నేర్చుకునేలా పుస్తకాన్ని రాశారు ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కోడూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మందడపు రాంప్రదీప్. 2009లోనే పుస్తకం రాసి దాతల సాయంతో అచ్చువేయించి విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నారు. ఖాళీ సమయాల్లో స్థానిక గ్రామాల్లో తిరుగుతూ పిల్లలకు ఇంగ్లీషు బోధన చేస్తున్నారు. జనవిజ్ఞాన వేదిక బాధ్యుడిగా మూఢనమ్మకాలు పోగొట్టడానికి విజ్ఞాన కార్యక్రమాలు నిర్వహించారు. గానుగపాడులోని మండల పరిషత్ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. సదుపాయాల లేమితో హోదా రద్దవుతుందేమోనని గ్రామపెద్దల సహకారంతో సుమారు రూ.50లక్షల విలువైన ఎకరం స్థలాన్ని సేకరించి భవనం నిర్మాణం చేయించి సొంత నిధులతో కంప్యూటర్, బీరువాలు, ఫర్నీచర్, పుస్తకాలను అందించారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



సమగ్రశిక్షలో ఎఫ్‌ఏవోగా ఎస్జీఆర్టీలో ఫిలాసఫీలో లెక్చరర్‌గా చేసి ప్రస్తుతం వేలేరు హైస్కూల్‌కు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు కొమ్మా విజయ్. నాడు-నేడులో ఆగిన పోయిన పనులను పూర్వ విద్యార్థుల స హకారంతో మౌలిక సదుపాయాలు కల్పించారు. అంతేకాక సదుపాయాలకు స్వంత నిధులు వినియోగిస్తూ విద్యార్థు లు, ప్రజల మన్ననలు పొందారు. ప్రస్తుతం జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచడమే ధ్యేయం



మల్లవల్లి హైస్కూల్‌లో సెంకడరీ గ్రేడ్ టీచర్‌గా నియమితులైనప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నారు వెలమర్తి రవిబాబు. ప్రభుత్వ పాఠశాలలపై ఉండే అపోహను పోగొడుతూ, వాటి గొప్పతనాన్ని వివరిస్తూ పాఠశాలలతో పాటు ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగేలా ప్రయత్నాలు చేసి సఫలమయ్యారు. గ్రామస్థుల సాంతో మల్లవల్లి హైస్కూల్‌కు 5 ఎకరాల స్థలాన్ని సేకరించడంతోపాటు భవన నిర్మాణానికి తనవంతు సహాయం చేసి మల్లవల్లి రవిగా గుర్తింపు పొందారు. సోషల్ ఉపాధ్యాయుడు అయినప్పటికీ విద్యార్థులకు క్షేత్రపర్యటన చేయించి సామాజికంగా ఎలా ఉండాలో నేర్పడడంతో దిట్ట. ప్రస్తుతం రేమల్లె మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు.


విద్యార్థుల తల్లులతో మాట్లాడుతున్న భగవద్గీత

దోనర్ల సాయంతో ఖర్చు లేకుండా విద్య

గుడివాడ రూరల్ మండలంలోని లింగవరం ప్రాథమిక పాఠశాలలో జ్యోగి భగవద్గీత ఎంఎస్సీ బీఈడీ (సింగిల్ టీచర్)గా పని చేస్తున్నారు. 23 మంది విద్యార్థులున్నారు. డీఎస్సీలో భగవద్గీతకు జాబ్ రాగా, మచిలీపట్నంలో రెండేళ్లు పనిచేసి 2023లో లింగవరం పాఠశాలకు బదిలీపై వచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేకంగా వాట్సాప్ క్రియేట్ చేసి, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు విద్యాబోధనపై వివరాలు వాట్సాప్‌కు పంపుతున్నారు. నవోదయకు విద్యార్థులను తయారు చేస్తున్నారు. తల్లిదండ్రులకు ఖర్చు లేకుండా డోనర్ల సాయంతో విద్యార్థులకు కావల్సినవి అందించడం గొప్పవిషయం. చిత్రలేఖనం, వ్యక్తిగత వికాసం, మహాభారత, రామాయణ కథలు చెప్పటం వంటి అంశాల్లో విద్యార్థులకు మంచి ప్రావీణ్యం నేర్పుతున్నారు.

మా మంచి లెక్కల మాస్టారు మేకా రాణి

విద్యార్థుల్లో సహజంగా గణితమంటే భయం ఉంటుంది. ఆ భయాన్ని పోగొట్టి ఆసక్తి కలిగించేలా బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు లెక్కల ఉపాధ్యాయురాలు మేకా రాణి. వేలాది రూపాయల సొంత నిధులు ఖర్చు చేసి స్వయంగా కొన్ని ఉపకరణలు తయారుచేసి గణితాన్ని బోధించడం విశేషం. మొవ్వ జడ్పీహెచ్ పాఠశాల నుంచి కాజ జడ్పీ పాఠశాలకు వచ్చిన ఆమె ఎక్కడ విధులు నిర్వహించినా విద్యార్థులతో సన్నిహితంగా ఉంటూ గణితంపై భయం పోగొట్టి మెదడులో నాటుకుపోయేలా చెప్పడం ఆమె ప్రత్యేకత. పనిచేసిన చోటల్లా 'మా మంచి లెక్కల టీచర్' అనే ఖ్యాతి గడించారు. సొంత నిధులతో గణితం ల్యాబ్‌ను ఏర్పాటుచేసి సృజనాత్మకతకు పదునుపెడుతూ విద్యార్థుల మదిలో ప్రత్యేకస్థానం సంపాదించుకున్నారు. కుటుంబసభ్యుల సహకారంతో పేద విద్యార్థులకు ఫీజులు కట్టడం, పుస్తకాలు కొనివ్వడం చేస్తున్నారు. మొవ్వ గ్రామానికి చెందిన కందుల భాస్కర్ ఏబీబీఎస్ విద్యకు సుమారు రూ.2 లక్షలకు పైగా ఆర్థిక సాయం చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా మీరజ్ నవాజిష్ హుస్సేన్



పమిడిముక్కల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అలీనఖీపాలెం ఎంపీయూపీ ఉర్దూస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మీరజ్ నవాజిష్ హుస్సేన్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో పని చేసి ఇటీవల అలీనఖీపాలెం బదిలీపై వచ్చారు. ఉత్తమ విద్యాబోధన, విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందిస్తూ గ్రామస్థులు, విద్యాకమిటీ మన్ననలు పొందారు. శుక్రవారం మచిలీపట్నంలో నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం అందుకోనున్నారు.

అగ్రికల్చర్ మిషన్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా కృష్ణసుమన్



తోట్లవల్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాకమూరుకు చెందిన శనివరపు కృష్ణసుమన్‌ను అగ్రికల్చర్ మిషన్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమిస్తు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కృష్ణసుమన్ జనసేన తోట్లవల్లూరు మండల అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. యాకమూరులో సేంద్రియ వ్యవసాయం చేయడంలో పేరుగాంచారు. జూన్‌లో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం 61వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 2024-25 సంవత్సరానికి చెరకు సాగులో సేంద్రియ పద్ధతులను అవలంబించినందుకు ఉత్తమ రైతుగా మంత్రి కె.అచ్చెన్నాయుడు నుంచి ఆయన అవార్డు అందుకున్నారు. తనను అగ్రికల్చర్ మిషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించడంపై కృష్ణసుమన్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ పదవి ద్వారా రైతులకు తగిన సేవలను అందించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, ఇతర జనసైనికులు, మిత్రపక్షమైన టీడీపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లడ్డూ రూ.1.03 లక్షలు

గుడివాడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏలూరురోడ్డులోని గాంధీ బొమ్మ సందులో ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం లడ్డూ వేలం నిర్వహించారు. 25కేజీల లడ్డూను గొర్ల జగన్నాథ కార్తికేయ దత్త రూ. 1,03,116కు దక్కించుకున్నారు. 11 కేజీల లడ్డూను మామిళ్లపల్లి నవీన్‌రెడ్డి(యూఎస్‌ఏ) రూ. 50,400కు, మరో లడ్డూను గుంటుపల్లి శ్రీలక్ష్మి రూ.36వేలకు దక్కించుకున్నారు.

బస్‌షెల్టర్ బాగుచేయండి

నీడ లేక అవస్థలు పడుతున్న ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు): తోట్లవల్లూరు సెంటరులో గతంలో ప్రయాణికులకు చక్కగా ఉపయోగపడిన బస్‌షెల్టర్ 2017 నుంచి నిరుపయోగంగా ఉంది. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో అధ్వానంగా మారింది. గతంలో ఈ బస్‌షెల్టర్ వద్దకు బస్సులు వచ్చి ఆగేవి. ప్రయాణికులు షెల్టర్‌లో కూర్చునే వారు. ఎండకు, వానకు ఇబ్బంది లేకుండా ఉండేది. గాలివానకు రేకులు పగిలిపోయాయి. దీంతో బస్‌షెల్టర్‌లోకి అడుగుపెట్టే పరిస్థితి లేకుండా పోయింది. బస్సుల కోసం సెంటర్‌లో, షాపుల నీడన నిల్చునే దుస్థితి ప్రయాణికులకు దాపురించింది. 2018లో బస్‌షెల్టర్ దుస్థితిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించడంతో అప్పటి ఉయ్యూరు ఆర్టీసీ డిపో మేనేజర్ జీవన్‌కుమార్ స్వయంగా వచ్చి పరిశీలించారు. రూ.2 లక్షలతో బస్‌షెల్టర్‌ను బాగుచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అయినా కార్యరూపం దాల్చలేదు. మరోవైపు బస్టాండ్ నిర్మాణానికి కోట సెంటర్‌లో దాత పొట్లూరి రమేష్ 12 సెంట్ల స్థలం ఇచ్చారు. ఈ స్థలం ఇచ్చి పాతికేళ్లయినా బస్టాండ్‌ను నిర్మించలేకపోయారు. ఉన్న బస్‌షెల్టర్‌ను పాడుబెట్టేశారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్‌షెల్టర్‌ను బాగుచేసి ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా చూడాలని కోరుతున్నారు.



తోట్లవల్లూరు సెంటర్‌లో పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా ఉన్న బస్‌షెల్టర్

రైతులు ఆందోళన చెందొద్దు

● తగినంత యూరియా అందిస్తాం: కలెక్టర్ డీకే బాలాజీ

పెదపారుపూడి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. గురువారం పెదపారుపూడిలోని నాగేశ్వరరాయ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో యూరియా సరఫరా, పంపిణీపై మాట్లాడారు. రైతులు బెనర్జీ, రమణ తదితరులు మాట్లాడారు. తమకు రెండు విడతలుగా యూరియా సరఫరా చేశారని, మూడవ విడత యూరియా సరఫరా చేయాల్సి ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. సంఘ పరిధిలోని గ్రామాల్లో 4 వేల ఎకరాలు భూమికి యూరియా అవసరముందని, కొంతమంది రైతులు ఒక కోటానే వేశారని, మరి కొంతమంది రెండవ కోటా వేస్తున్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రైతులకు కావాల్సిన యూరియా సరఫరా చేస్తామని తెలిపారు. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి, జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, గుడివాడ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ కవిత, తహసీల్దార్ శ్రీను నాయక్, గుడివాడ ఏవో అనంతలక్ష్మి, గ్రామ రెవెన్యూ సహాయకురాలు చుక్కమ్మ, లక్ష్మీ, రైతులు పునుకొల్లు బెనర్జీ, బొల్లవరపు శారాంబది తదితరులు పాల్గొన్నారు.



పెదపారుపూడిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

భట్లపెనుమర్రు, ఐనంపూడిలో ఆర్డీవో పర్యటన

కూచిపూడి/ పమిడిముక్కల: యూరియా గురించి రైతులు ఆందోళన చెందొద్దని యూరియా నిల్వలు అందుబాటులోకి తెచ్చే విధంగా ప్రభుత్వ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఉయ్యూరు ఆర్డీవో హెలా షారోన్ పేర్కొన్నారు. యూరియా ఇబ్బందులపై తెలుసుకునేందుకు మొవ్వ మండలం భట్లపెనుమర్రు, పమిడిముక్కల మండలం ఐనంపూడికి ఆమె విచ్చేసి రైతులను అడిగి వివరాలు సేకరించారు. కూచిపూడి పీఏసీఎస్‌లో యూరియా అందుబాటులో ఉంచాలని ఆర్డీవోను రైతులు కోరారు. మొవ్వ తహసీల్దార్ మస్తాన్, ఏవో సురేష్ బాబు నాయక్ పాల్గొన్నారు. నాటువేసినప్పుడు ఎకరాకు 30 కేజీలు, తరువాత 30 రోజులకు రెండోవిడతగా 30 కేజీలు, 60రోజులకు మూడవ విడతగా 30 కేజీలు యూరియా సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, దళారులు యూరియా కొనుగోలుచేసి అక్రమంగా నిల్వచేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు. యూరియా ఏ గ్రామానికి ఎప్పుడు వస్తుందనే సమాచారాన్ని వీఏఏ ద్వారా రైతులకు తెలియపరుస్తామని పేర్కొన్నారు.



భట్లపెనుమర్రులో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో హెలా షారోన్

1.3 కిలోల గంజాయి పట్టివేత

● ఐదుగురికి 14రోజుల రిమాండ్

గుడివాడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అక్కినేని నాగేశ్వరరావు కళాశాల వెనుక తుప్పల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు గురువారం ఉదయం తనిఖీలు చేయగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో గంజాయి విక్రేతలను మీడియా ఎదుట ఆయన హాజరుపరిచారు. బేతవోలుకు చెందిన గొడవర్తి కిరణ్, పడమట నాగస్వామి, ఇందిరానగర్‌కాలనీకి చెందిన ఎలమర్తి నాని, కార్మికనగర్‌కు చెందిన మాదాసు రామకోటేశ్వరరావు, ఓర్సు కిషోర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరికి సహకరించిన బేతవోలుకు చెందిన పడమట మణికంఠ ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్నాడని తెలిపారు. నిందితులు ఐదుగురిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా వారికి 14రోజులు రిమాండ్ విధించారని, వీరిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు. స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేసినా, అమ్మినా, వినియోగించినా వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

వినాయక నిమజ్జన ఊరేగింపులో అపశ్రుతి

● ట్రాక్టర్ ఢీకొని ఒకరి దుర్మరణం, మరొకరికి గాయాలు

పెదపారుపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యలమర్రు గ్రామంలోని రజక బజారులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జనం ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. విగ్రహాన్ని ఊరేగిస్తున్నప్పుడు ట్రాక్టర్ అదుపు తప్పి ఇద్దరిని ఢీకొంది. వారిలో ఒకరు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం జరిగింది. యలమర్రులో వినాయక ఊరేగింపు శివాలయం ఎదురుగా వచ్చేసరికి రోడ్డుకు ఒక పక్క ఇసుక, మరొక పక్క కంకర చిప్స్ గుట్టలు ఉన్నాయి. అక్కడ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఎక్స్‌లేటర్ గట్టిగా తొక్కడం వల్ల అదుపు తప్పి ముందు నడుస్తున్న మక్కువ రాము, పుట్టి రవికుమార్‌ను ఢీకొంది. దీంతో వారికి గాయాలయ్యాయి. వెంటనే యలమర్రు పీహెచ్‌సీకి ప్రథమ చికిత్స నిమిత్తం తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం 108లో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గం మధ్యలో మక్కువ రాము (40) చనిపోయాడు. పుట్టి రవికుమార్ ప్రస్తుతం గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగి వాహనాలు నడుపుతున్న 12 మందికి జరిమానా

గుడివాడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో 12మందిపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్ఐ పూడి నాగరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 12మంది పట్టుబడ్డారని, వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

లారీ డ్రైవర్‌పై కేసు

మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటానమి వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం రాత్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గరలో అడ్డదిడ్డంగా, అతి ప్రమాదకరంగా నడుపుతున్న లారీని ఆపి డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌ను నిర్వహించగా అతను మద్యం తాగినట్టు రుజువవ్వడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కూటమి ప్రభుత్వానికి అర్చక సమాఖ్య ధన్యవాదాలు

గుడివాడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో అర్చకులకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సందర్భంగా అర్చక సమాఖ్య గుడివాడ డివిజన్ అధ్యక్షుడు భారతుల వెంకటరమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఆలయాల్లో నిర్వహించే హోమాలు, యాగాలు, అభిషేకాలు, కుంభాభిషేకాలు వివిధ పూజా కార్యక్రమాల్లో రాజకీయ నాయకులు, అధికారులు, కమిషనర్లు జోక్యం చేసుకోకూడదని రాష్ట్ర ప్రభుత్వం జీ.వో నెం.223 జారీచేయడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాల్లో పూజారుల్లో ఏ విషయంలోనైనా ఏకాభిప్రాయం కుదరకపోతే సరైన నిర్ణయం కోసం పీఠాధిపతితో సంప్రదించవచ్చునని ప్రభుత్వం సూచించిండం మంచి పరిణామమన్నారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్ బహూకరణ

నందివాడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ పోలిమెట్ల మరియదాసు కుమారుడు పోలిమెట్ల రవిప్రసాద్ సొంత నిధులు రూ.6,80,000తో రుద్రపాక జిల్లా పరిషత్ పాఠశాలలో బోరు, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి గురువారం మాజీ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కొసరాజు వీరయ్య చౌదరితో ప్రారంభింపజేశారు. విద్యార్థుల తాగునీటి ఇబ్బందులు తీర్చడం అభినందనీయమని వీరయ్య చౌదరి అన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య, పాలడుగు నానారావు, ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు పాల్గొన్నారు.



ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీరయ్య చౌదరి

డ్రోన్ వినియోగంపై డెమో

కూచిపూడి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పురుగుమందుల పిచికారీలో డ్రోన్ వినియోగంతో రైతులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని మొవ్వ సబ్ డివిజన్ ఏడీఏ ఎస్.శ్యామల పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ సబ్సిడీపై అందించిన డ్రోన్‌ను వ్యవసాయ శాఖాధికారులు పెడసనగల్లులో గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా డెమో నిర్వహించారు. తహసీల్దార్ మస్తాన్, ఏవో బి.సురేష్ బాబూనాయక్, ఉద్యానవన శాఖాధికారిణి కీర్తి అంజలి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించండి

● పెంజంద్ర పీఏసీఎస్ త్రిసభ్య కమిటీకి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచన

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించాలని పెంజంద్ర పీఏసీఎస్ త్రిసభ్య కమిటీకి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. గురువారం పెంజంద్ర పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తొలుత గుడ్లవల్లేరు శివారు నుంచి భారీగా బైక్ ర్యాలీగా పెంజంద్ర చేరుకొన్నారు. బొప్పన శివప్రసాద్ చైర్మన్‌గా, పర్సన్లుగా పెనుమాక చిట్టిబాబు, సయ్యద్ ఖరీద్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకటరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, జంగం మోహనరావు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు

డొంక రోడ్లను అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

డొంకరోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరు మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ కమిటీ అధికారులు, పాలకవర్గంతో సమీక్షించారు. మార్కెట్ కమిటీ ఆదాయం నుంచి వచ్చే నిధులను డొంకరోడ్ల అభివృద్ధికి కేటాయించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడతానని, ఆయన అనుమతులు ఇస్తారని నమ్మకం తనకుందని ఎమ్మెల్యే అన్నారు. అంచనాలను సిద్ధం చేయాలని మార్కెట్ యార్డ్ అధికారులకు ఆయన సూచించారు. చైర్మన్ పొట్లూరి రవికుమార్, కమిటీ వైస్ చైర్మన్ కూనపురెడ్డి కృష్ణయ్య, యార్డు కార్యదర్శి హేమసుందర్ పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తాం

గుడివాడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని, అందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. గురువారం గౌరీశంకరస్వామి దేవస్థానంలో ధర్మకర్తల కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కమిటీ చైర్మన్‌గా నెరుసు సుభాష్ చంద్రబోస్, ధర్మకర్తలుగా అనుమంతపల్లి మల్లి, పాలిశెట్టి శ్రీను, పావులూరి శ్రీకుసుమ, యర్రంశెట్టి విజయలక్ష్మి, భరతుల వరలక్ష్మి, నల్లి భవాని, కోడూరు నాగేశ్వరరావు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం మహోత్సవాల ఆహ్వాన పత్రికలను గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు.

ఉద్యోగుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోండి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు ఇరిగేషన్ ఉద్యోగులు వినతి

గుడివాడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని తమపట్ల సానుకూలంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రామును ఇరిగేషన్ ఉద్యోగులు కోరారు. విజయవాడలోని కృష్ణా ఈస్ట్రన్ డివిజన్‌ను గుడివాడకు తరలించాలని కోరుతూ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వినతిపత్రాన్ని అందజేసిన విషయం విదితమే. గురువారం ప్రజావేదికలో ఇరిగేషన్ ఎన్జీవోస్ సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు, ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ పశ్చిమ కృష్ణా కార్యదర్శి పి.రమేష్, ఉయ్యూరు తాలుకా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వై.లంకేశ్వరరావు, విజయవాడ నగర అధ్యక్షుడు సి.హెచ్ సాయికిషోర్, కార్యదర్శి బి.శివల ఆధ్వర్యంలో ఉద్యోగులు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావును కలిసి ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ఉద్యోగుల తరలింపు, ఇబ్బందులను వివరిస్తూ ఎమ్మెల్యే వెనిగండ్లకు వినతిపత్రాన్ని అందజేశారు. సాంకేతిక సమస్యలు ఉన్నాయని, ఉద్యోగులను ఇబ్బంది పెట్టబోనని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ యిచ్చినట్లు ఇరిగేషన్ ఉద్యోగులు పేర్కొన్నారు.

వాటర్ ట్యాంకర్ అందజేత

కూచిపూడి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మొవ్వ మండల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు టీడీపీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు సొంత నిధులతో వాటర్ ట్యాంకర్‌ను గురువారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చేతులమీదుగా అందజేశారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజా అవసరాల కోసం ముందు చూపుతో వాటర్ ట్యాంకర్ అందించటం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పామర్రు ఏఎంసీ చైర్మన్ జన్ను శోభన్‌బాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.



నీటిని వదిలి వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

గణనాథుడికి ప్రత్యేక పూజలు

కూచిపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిడుమోలు గ్రామంలో నిర్వహిస్తున్న వినాయకుడి చవితి ఉత్సవాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించారు. వేలాది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీదాస్, జొన్నలగడ్డ సత్యనారాయణ దంపతులతోపాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

తోట్లవల్లూరు/ గుడ్లవల్లేరు/ గుడివాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బావిభారత పౌరులను తయారు చేసే ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందని సుధీర్ టింబర్ డిపో అధినేత నూకల వెంకట సాంబశివరావు అన్నారు. తోట్లవల్లూరు మండలం యాకమూరు ప్రాథమిక పాఠశాలలో సుధీర్ టింబర్ డిపో సహకారంతో ఉయ్యూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించి ఉపాధ్యాయులందరినీ సత్కరించి మెమెంటోలు బహూకరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నల్ల శ్రీనివాసరావు, కార్యదర్శి నెల్లి రాంబాబు, బి ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు. గుడ్లవల్లేరు మండలం పెంజంద్ర జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు. గుడ్లవల్లేరు ఎంఈవో-1 జగన్మోహనరావు, ఎంఈవో- 2 వేణుగోపాల్, హెచ్ఎం కె.మహాలక్ష్మి పాల్గొన్నారు. గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. అధ్యాపకులను కళాశాల పాలకవర్గ ఘనంగా సత్కరించింది. కళాశాల కార్యదర్శి కె.ఎస్.అప్పారావు, పాలకవర్గ అధ్యక్షుడు ఎల్ఆర్కే ప్రసాద్, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెంజంద్ర హైస్కూల్‌లో..



యాకమూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సాంబశివరావు, రాంబాబు, ప్రసాదరాజు



గుడివాడ ఏఎన్ఆర్ కళాశాలలో అధ్యాపకులను సత్కరిస్తున్న కార్యదర్శి అప్పారావు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

భిక్షాటనకు వచ్చి చోరీ..పోలీసుల అదుపులో నలుగురు

కోడూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్వాముల వేషధారణలో భిక్షాటనకు వచ్చి ఓ ఇంట్లో చోరీ చేసిన సంఘటన లింగారెడ్డిపాలెంలో జరిగింది. ఎస్సై చాణక్య తెలిపిన వివరాల ప్రకారం..'గ్రామానికి చెందిన బచ్చు వెంకటస్వామి ఇంటికి స్వాముల వేషధారణలో నలుగురు భిక్షాటనకు వచ్చారు. ఆ సమయంలో వెంకటస్వామి ఇంటి వద్ద టేబుల్‌పై డ్వాక్రా కట్టేందుకు ఉంచిన రూ.11 వేలను చూశారు. వెంకటస్వామి అతని భార్య బయటకు వెళ్లే వరకు వేచి ఉండి ఆ రూ.11 వేలు దొంగిలించారు. వెంకటస్వామి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశాం. బాపట్ల జిల్లా నగరం గ్రామానికి చెందిన గంధం శివయ్య, గంధం తోట స్వామి, పాస్టం బాజీ, పాస్టం యేసు చోరీ చేసినట్టు గుర్తించాం. వారిని అదుపులోకి తీసుకుని నగదు రికవరీ చేశాం.'

నాటక అకాడమీ రాష్ట్ర డైరెక్టర్‌గా పైడిపాముల స్వప్న



చల్లపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాటక అకాడమీ రాష్ట్ర డైరెక్టరుగా చల్లపల్లి-1 ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న నియమితులయ్యారు. స్వప్న గత ఐదేళ్లలో టీడీపీ చేపట్టిన అనేక పోరాటాల్లో ముందువరుసలో పాల్గొన్నారు. స్వప్న నియామకంపై పార్టీ శ్రేణులు, కూటమి నేతలు హర్షం వ్యక్తంచేశారు. అభినందనలు తెలిపారు.

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా హసీం బేగ్



మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా తెలుగుయువత ఉపాధ్యక్షుడు హసీం బేగ్ నియమితులయ్యారు. హసీం బేగ్‌ను గురువారం పలువురు నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థ కార్యకర్తలు అభినందించారు. చాలాకాలంగా హసీం బేగ్ టీడీపీలో క్రియాశీలకంగా ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేయడంలో ముందుంటున్నందుకు మంత్రి నారా లోకేశ్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. రూ.లక్ష చెల్లించి క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శిగా ఉంటూ పేద విద్యార్థులకు సాయం అందిస్తున్నారు. యువతను చైతన్యవంతం చేయడంలో హసీం బేగ్ తనదైన పాత్ర పోషిస్తున్నారు. మణిపూర్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. త్వరలో డాక్టరేట్ పట్టాను అందుకోనున్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

● తగినంత యూరియా అందిస్తాం: కలెక్టర్ బాలాజీ

గూడూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందొద్దని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. గురువారం గూడూరు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి రైతులతో యూరియా సరఫరా, పంపిణీపై ముఖాముఖి మాట్లాడారు. తమకు రెండు డోసుల యూరియా వచ్చిందని, 3వ డోసు పంపిణీ చేయాల్సి ఉందని రైతులు ఆయనకు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులకు కావలసిన యూరియా తప్పకుండా సరఫరా చేస్తామని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.పద్మావతి, జిల్లా మేనేజర్ మురళి కిషోర్, తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, డీసీ ఛైర్మన్ పోతన స్వామి, తోట వేణు రైతులు, అధికారులు పాల్గొన్నారు.



గూడూరు పీఏసీఎస్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

శ్రీకాకుళం పీఏసీఎస్‌కు అందని యూరియా

ఘంటసాల: నియోజకవర్గంలోని చాలా పీఏసీఎస్‌లకు యూరియా వచ్చినప్పటికీ శ్రీకాకుళం పీఏసీఎస్‌కు రాలేదని, రైతాంగం ఇబ్బంది పడుతోందని శ్రీకాకుళం పీఏసీఎస్‌కు యూరియా సరఫరా చేయాలని అధికారులను టీడీపీ నేత, ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా) కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు రెండో విడత ఎరువు వేసే సమయం దాటిపోతోందని ఆయన తెలిపారు.

తక్షణమే యూరియా సరఫరా చేయాలి

● మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు డిమాండ్

ఘంటసాల: యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా సమస్య ఉన్నా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే యూరియా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు గురువారం వైసీపీ నేతలతో కలిసి తహసీల్దార్ విజయప్రసాద్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. జడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ, వైసీపీ మండల కన్వీనర్ వేమూరి వెంకట్రావు, వేమూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వాకాలమ్మ ఆలయ కమిటీ బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మంగినపూడిలోని వాకాలమ్మతల్లి దేవాలయం నూతన కమిటీ గురువారం బాధ్యతలు స్వీకరించింది. ఛైర్మన్‌గా మెండు భానుమూర్తి, డైరెక్టర్ వేముల వీరవెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించగా, వారిని డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పెదపాంఢ్రాకలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో స్వాతి

రొయ్యల చెరువుల పరిశీలన

బంటుమిల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొర్లపాడు పంచాయతీ పెదపాంఢ్రాక రెవెన్యూ పరిధిలో 250 ఎకరాల రొయ్యల చెరువులు సాగుచేస్తున్న యజమాని తమను ఇబ్బంది పెడుతున్నాడని సమీప రైతులు ఇచ్చిన ఫిర్యాదుపై మచిలీపట్నం ఆర్డీవో స్వాతి గురువారం విచారణ చేపట్టారు. చెరువులను ఆర్డీవో పరిశీలించారు, పుంత మధ్యలో ఏర్పాటు చేసిన బోరును వెంటనే తొలగించాలని ఆదేశించారు. పుంత విస్తీర్ణాన్ని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. రికార్డులను ఆర్డీవో కార్యాలయానికి తీసుకురావాలని ఆదేశించారు. స్థానిక రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పూర్ణచంద్రరావు, సర్వేయర్ దాస్, డీసీ ఛైర్మన్ కాశీ, నీటి సంఘం అధ్యక్షుడు కంఠమనేని మురళి, రైతులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్

మచిలీపట్నం టౌన్/గూడూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం నేటి ఉపాధ్యాయులకు ఆదర్శమని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీ అన్నారు. విశ్వవిద్యాలయంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో సీఎస్ఈ, ఈసీఈ, సైన్స్, హ్యూమానిటీస్ నుంచి ముగ్గురు ఉత్తమ అధ్యాపకులను సత్కరించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.విజయకుమారి, డీన్ సుందరకృష్ణ, ఎం.బాబురెడ్డి, ఆర్.కిరణ్‌కుమార్, డి.రామశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

గూడూరు: గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఎక్సలెన్స్ అవార్డులు సాధించిన పీడీలు మత్తి అరుణ, రాజేష్‌బాబును ప్రత్యేకంగా సత్కరించారు.



ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న కేయూ వీసీ కూన రాంజీ



గూడూరు హైస్కూల్‌లో సీనియర్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నేడు 100 మందికి సన్మానం

పెడన: ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు బంటుమిల్లిలోని సెయింట్ జాన్స్ మోడల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అనుముకొండ గౌరీప్రసాద్ తెలిపారు. 100 మంది ఉపాధ్యాయులను సన్మానిస్తామని, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, డీఈవో రామారావు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

ఆరవ సుజాతకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు



నాగాయలంక: నాగాయలంక జడ్పీ పాఠశాల ప్లస్‌లో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీషు) ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఆరవ సుజాత 2025 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యేలా ఆంగ్ల భాషను బోధించినందుకు ఈ అవార్డును ఇచ్చినట్లు తెలిపారు. సుజాతకు పాఠశాల విద్యాకుటుంబం అభినందనలు తెలిపింది.

విశ్రాంత ఎంఈవో నాగేశ్వరరావుకు ఘన నివాళి

ఘంటసాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఎం ఈ వో మొవ్వ నాగేశ్వరరావు మృతి బాధాకరమని పలువురు టీడీపీ నేతలు పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిలోని మొవ్వ నాగేశ్వరరావు ఇంటి వద్ద జరిగిన సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది నాగేశ్వరరావు మాస్టారు మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, కృష్ణా మిల్క్ యూనియన్ కార్యవర్గ సభ్యుడు వేమూరి సాయి వెంకటరమణ, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, కొడాలి పీఏసీఎస్ ఛైర్మన్ గుత్తికొండ వరప్రసాద్, శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా), టీడీపీ నేత పాటిబండ్ల నరేష్, నాగేశ్వరరావు కుమారుడు మొవ్వ లీలా శ్యాంప్రసాద్, మొవ్వ లీలా రాంకుమార్ పాల్గొన్నారు.



నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మంగినపూడి బీచ్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల కోసం ప్రీ వెడ్డింగ్‌కు కావాల్సిన స్థలాన్ని కేటాయించేందుకు ప్రభుత్వంతో మాట్లాడాలని ఎమ్మెల్యే నందమూర్తి బాలకృష్ణను మచిలీపట్నం ఫోటో, వీడియోగ్రాఫర్ల సంఘ అధ్యక్షుడు చిలంకుర్తి శేషు కోరారు. గురువారం నిమ్మకూరు వచ్చిన బాలకృష్ణను మచిలీపట్నం ఫోటో, వీడియో గ్రాఫర్ల సంఘ నాయకులు కలసి మాట్లాడారు. రాష్ట్రంలో మొట్టమొదటిగా మచిలీపట్నంలో కెమెరా సృష్టికర్త డాగురే విగ్రహాన్ని నెలకొల్పామని, ఈ విగ్రహాన్ని సందర్శించేందుకు ఒకసారి రావాలని బాలకృష్ణను శేషు కోరారు. ఇందుకు బాలకృష్ణ సానుకూలంగా స్పందించారు.



ఎమ్మెల్యే బాలకృష్ణకు ఫొటోగ్రాఫర్ల సమస్యలు చెబుతున్న చిలంకుర్తి శేషు

మర్యాదపూర్వక కలయిక

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరానికి వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్య క్షుడు పీవీఎన్ మాధవ్‌ను డీసీఎంఎస్ అధ్యక్షుడు బండి రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. సమన్వయంతో పనిచేసి, కూటమి ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడుపుదామని మాధవ్ సూచించారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను సత్కరిస్తున్న డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ

ఎన్టీఆర్ జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలి

● రాధా-రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ధనికొండ ధర్మారావు వినతి

ఎన్టీఆర్ జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు, కృష్ణాజిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను రాధా-రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ధనికొండ ధర్మారావు కోరారు. ఈమేరకు వినతిపత్రం ఇచ్చారు. మాధవ్‌ను ధర్మారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్టీఆర్ జిల్లాకు మోహనరంగా పేరు పెట్టాలని 2023 నుంచి సంతకాల ఉద్యమం చేస్తున్నామని తెలిపారు. కూటమి గెలుపు కోసం రాధా రంగా మిత్రమండలి పనిచేసిందని తెలిపారు.

గిన్నీస్ రికార్డులో భాగస్వాములవడం గర్వకారణం

అవనిగడ్డ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ సంస్థ సాధించిన గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో అవనిగడ్డ బ్రాంచ్ ఏజెంట్లు భాగస్వాములు కావటం గర్వకారణమని అవనిగడ్డ బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్ అన్నారు. ఈ ఏడాది జనవరి 20వ తేదీన ఒకే రోజులో దేశవ్యాప్తంగా 5 లక్షల 88 వేల 107 పాలసీలు విక్రయించి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సంస్థ సాధించింది. అవనిగడ్డ బ్రాంచ్ నుంచి 211 మంది ఏజెంట్లు 339 పాలసీలు చేశారు. రికార్డులో భాగస్వాములైన ఏజెంట్లకు పేరు, వివరాలతో కూడిన సర్టిఫికెట్లను గురువారం అవనిగడ్డ బ్రాంచ్ లో పంపిణీ చేశారు. సేల్స్ బీఎం రామయ్య, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, కార్యాలయ అధికారులు, క్లియా, లికా, ఏజెంట్లు పాల్గొన్నారు.



ఏజెంట్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎల్ఐసీ అవనిగడ్డ బీఎం ఆకుల హరిప్రసాద్

వైద్య శిబిరం

69వ బీమా వారోత్సవం సందర్భంగా అవనిగడ్డ ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో ఏజెంట్లకు ఆరోగ్య పరీక్షా శిబిరాలు నిర్వహించారు. ఉచిత దంత, నేత్ర, మధుమేహ పరీక్షా శిబిరాలను నిర్వహించారు. ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పరీక్షలు చేయించుకున్నారు. ఎల్ఐసీ బీఎం ఆకుల హరిప్రసాద్, ఎస్‌బీఎం రామయ్య పర్యవేక్షించారు.

విద్యార్థులకు అవార్డుల ప్రదానం

పెడన, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ విజయానంద జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే, అవార్డుల ప్రదానోత్సవాన్ని బ్రహ్మపురంలోని దేవాంగ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికారు. విద్యలో ప్రతిభ కనబరిచిన సీనియర్ ఇంటర్ విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువులను సన్మానించారు. ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త వై.శివప్రసాద్, అప్సా జిల్లా అధ్యక్షుడు అనుముకొండ గౌరీప్రసాద్, నీట్ అకాడమీ డైరెక్టర్ నేత్రానందం, కళాశాల ప్రిన్సిపాల్ పి.మధుసూదనరావు, డైరెక్టర్ విద్యాధర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తున్న ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్

మహిళా నేతలకు సన్మానం

చల్లపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జనసేన నాయకుడు అడపా రాంబాబు ఆధ్వర్యంలో చల్లపల్లి మహిళా నేతలకు గురువారం సన్మానం చేశారు. ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, రాష్ట్రస్థాయి డైరెక్టర్లుగా నియమితులైన తెలుగు మహిళా నేత బోలెం నాగమణి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారిని రాంబాబు నేతృత్వంలో కూటమి నేతలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ బొందలపాటి వీరబాబు, టీడీపీ నేత రావి రాజేశ్వరరావు, జనసేన నేతలు జీవీ తాతారావు, గంగిశెట్టి రాజేంద్ర, ఏపీ చంద్రశేఖరరావు, ఎం.రంజిత్‌కుమార్, పినిశెట్టి నిరంజన్, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు అడపా గురవయ్య పాల్గొన్నారు.



మహిళా నేతలను సన్మానిస్తున్న జనసేన నేత అడపా రాంబాబు

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేర పరిశోధన సులభతరం

మోపిదేవి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేర పరిశోధన సులభతరం అవుతుందని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు తెలిపారు. గురువారం మెరకనపల్లి గ్రామాన్ని సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ సందర్శించారు. గ్రామంలో వివిధ ప్రదేశాల్లో 22 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సీఐకు ఎస్సై వివరించారు. పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరరావు, హెచ్ఎం సౌజన్య, సొసైటీ కార్యదర్శి యన్నా శ్రీనివాసరావు, వీఆర్వో మోపిదేవి వెంకటేశ్వరరావు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు మెరకనపల్లి సుబ్బారావు, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు యర్రంశెట్టి సునీల్, నీటి సంఘం డైరెక్టర్ బొందలపాటి బసవయ్య, ఆకుల శేఖర్ బాబు, ఆకుల సుబ్బారావు పాల్గొన్నారు.

అప్పు చెల్లించలేదని దాడి

నాగాయలంక, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు చెల్లించలేదని ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన గురువారం నాగాయలంకలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కైతేపల్లి వెంకటేష్ ఇదే గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు వద్ద రెండేళ్ల క్రితం రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ప్రతీ నెలా వడ్డీ చెల్లిస్తున్నాడు. ఇటీవల రెండు నెలల్లోపు తీసుకున్న మొత్తం చెల్లించాలని వెంకటేష్‌ను శ్రీనివాసరావు అడిగాడు. అందుకు వెంకటేష్ నిరాకరించారు. దీంతో రుణం తీసుకునే సమయంలో మధ్యవర్తిగా ఉన్న మండవ బాలవర్ధిరావు కార్యాలయానికి వెంకటేష్‌ను పిలిపించాడు. బైక్‌పై అక్కడికి వెంకటేష్ వస్తుండగా శ్రీనివాసరావు, అతని కుమారులు రామాంజనేయులు, శివాజీ, గణేష్‌లు అడ్డగించారు. వెంకటేష్‌ను బాలవర్ధిరావు కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడ చేతులు, కాళ్లతో వెంకటేష్‌ను కొట్టారు. బాలవర్ధిరావు కూడా తనను చేతులతో దాడి చేశాడని వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాయపడిన వెంకటేష్‌ను బంధువులు అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోడూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మందపాకల సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ చింతకోళ్ల ఫీడర్‌పై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.